Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 336 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) బుధవారం, 26 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# వెలిగొండ జలసిరులు - అభివృద్ధికి రెక్కలు అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్

## - 30 ఏళ్ల క్రితం తీసుకున్న సంకల్పం నెరవేరిందంటూ ఎక్స్ వేదికగా తన భావాలను వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు

## - ఈ నెల 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించబోతున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడి









**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రతి రైతు పొలానికి నీరు... ప్రతి యువకుడికి ఉపాధి... ప్రతి కుటుంబానికి భరోసా కల్పించాలని సీబీఎన్ అనే నేను సంకల్పించినట్టు ఎక్స్ వేదికగా ప్రకటించిన ముఖ్యమంత్రి. ఇంటింటికి కుళాయి ద్వారా పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలను ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత సమస్య చూపిస్తామంటూ భరోసా. 30 ఏళ్ల క్రితం వెలిగొండ ప్రాజెక్టుకు తాను శంకుస్థాపన చేసిన ఫొటోను జత చేస్తూ ట్వీట్ చేసిన సీఎం చంద్రబాబు.

ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్...

ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, సవాళ్లు, సమస్యలను అధిగమించి భగీరథ ప్రయత్నంతో, గొప్ప సంకల్పంతో వెలిగొండ ఫేజ్–1ను పూర్తి చేసి కరువు నేలకు కృష్ణమ్మ జలాలను అందించబోతున్నాం. తీవ్ర కరువు ప్రాంతంగా, అత్యంత వెనుకబాటుతనంతో ఉన్న ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాలు మార్చేందుకు 30 ఏళ్ల క్రితం తీసుకున్న సంకల్పం నేడు సాకారమైంది. ఉమ్మడి రాష్ట్రంలో నాడు ముఖ్యమంత్రిగా 1996 మార్చి 5న వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాను. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టును నా చేతుల మీదుగా ప్రారంభిస్తున్నాను. 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు రిలీజ్ చేయబోతున్నాం. ఈ చారిత్రక ఘట్టానికి ఈ నెల 31వ తేదీ మార్కాపురం జిల్లా వేదిక కాబోతోంది. ఫేజ్–1తో 1.19 లక్షల ఎకరాలకు... ఫేజ్–2తో 3.283 లక్షల ఎకరాలకు సాగునీరును అలాగే లక్షలాది మందికి తాగునీటితో తరతరాలుగా కరువుతో పోరాడిన ప్రజలకు ఉపశమనం కల్పించడమే మా లక్ష్యం. దుర్భిక్ష ప్రాంతమైన మార్కాపురానికి వెలిగొండ...వెలుగుల దండ అవుతుంది. వెలిగొండ జల విజయంతో కరువు ప్రాంతంలో కృష్ణమ్మతో జలహారతి ఇస్తున్నాం. నెర్రలు బారిన నేలను కృష్ణా జలాలతో తడపబోతున్నాం. 31వ తేదీ నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు... ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడుగుతుంది. ఈ జలంతో జీవం–జీవితం... సాగు–బాగు. పశ్చిమ ప్రకాశం ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి ఆ ఆకాంక్షను నెరవేర్చాం. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా చేసేందుకు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో త్వరలో పనులు ప్రారంభిస్తున్నాం. నేషనల్ హైవేలు, పోర్టులతో ఈ ప్రాంతానికి లాజిస్టిక్స్ లోటు లేకుండా చేస్తున్నాం. బెంగుళూరు–అమరావతి హైవే, రామాయపట్నం పోర్టులతో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుస్తున్నాం.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చి పశ్చిమ ప్రకాశం ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం. ప్రజల జీవితాలు మార్చాలి, వెనుకబాటును దూరం చేయాలనే గట్టి పట్టుదలతో శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవుని చెంతకు కృష్ణమ్మను తీసుకువస్తున్నాం. ప్రతి రైతు పొలానికి నీరు... ప్రతి యువకుడికి ఉపాధి...ప్రతి కుటుంబానికి భరోసా...ఇదే 'సీబీఎన్ అనే నేను' సంకల్పం. ప్రతి పౌరుడూ అనే నేను స్ఫూర్తితో పనిచేసి వ్యక్తిగత విజయాలు సాధిస్తూ జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నాను.

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

## - భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట - 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా - 181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి - మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు - గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రకృతి ఆరాధన–ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

**2027 పుష్కరాలకు భారీగా భక్తులు**

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి



10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సమీక్షలో ఇంకా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవాదాయ–పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పుష్కర ఘాట్లను కలిపే రహదారుల నిర్మాణం సహా, పుష్కరాలు జరిగే 6 జిల్లాలో ఏ రోడ్లపైనా గుంతలు కనిపించకూడదు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. బ్రిడ్జిల సామర్థ్యాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా మరమ్మతులు చేయాలి. గోదావరిలో చుక్క కూడా మురుగు నీరు కలవకుండా చూడాలి. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఏఐ వినియోగం**

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ–ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిస్ప్లేమెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి**

గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు–పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు దీ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి కొవ్వూరు వరకు రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. రాజమహేంద్రవరం–పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు**

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డీఆర్‌డీఓ మిస్సైల్ టెక్నాలజీ బదిలీకి రాజ్‌నాథ్ ఆమోదం



**ఇంటర్‌నెట్ డెస్క్:** డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అభివృద్ధి చేసిన అన్ని కన్వెన్షనల్ మిసైల్ సిస్టమ్స్‌ను.. ఇండియన్ ఇండస్ట్రీస్ ఫర్ ఇండీజినస్ ప్రొడక్షన్‌కు బదిలీ చేయడానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర రక్షణ శాఖ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. భారత రక్షణ రంగంలో స్వయం సమృద్ధిని సాధించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, స్థానిక తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రక్షణ శాఖ ఆ ప్రకటనలో పేర్కొంది. అర్హత కలిగిన భారతీయ రక్షణ కంపెనీలు ఈ అధునాతన క్షిపణులను దేశీయంగా తయారు చేసే అవకాశం లభిస్తుందని రక్షణ శాఖ తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా పెద్ద రక్షణ సంస్థలకే కాకుండా.. డిఫెన్స్ సప్లై చైన్‌లో భాగస్వామ్యులయ్యే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, ఇతర సాంకేతిక భాగస్వాములకు భారీగా అవకాశాలు లభిస్తాయని వెల్లడించింది.

# ఆన్‌లైన్ స్నేహం పేరుతో భారీ మోసం.. రూ.కోటిన్నర పోగొట్టుకున్న యువతి



**విజయవాడ, (రాజధాని వార్తలు):** చనిపోతానని బెదిరించి ఓ యువతి నుంచి రూ.కోటిన్నర కొట్టేసిన ఘటన విజయవాడలో చోటు చేసుకుంది. స్నాప్‌చాట్‌లో యువతితో పరిచయం పెంచుకున్న ఓ యువకుడు.. ఆమెను నమ్మించి మోసం చేశాడు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టి మోసపోయానని డబ్బులు ఇవ్వాలంటూ నమ్మించాడు. విడతల వారీగా డబ్బులు ఇచ్చినప్పటికీ మరింతగా ఇవ్వాలని బెదిరింపులకు దిగడంతో చివరకు సదరు యువతి పోలీసులను ఆశ్రయించారు. విజయవాడకు చెందిన యువతి.. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గౌతం అనే యువకుడు స్నాప్‌చాట్‌లో యువతికి పరిచమయ్యాడు. తాను కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నానంటూ నమ్మించాడు. క్రిప్టో కరెన్సీలో రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు యువతికి గౌతం చెప్పాడు. నిజమేనని నమ్మిన యువతి మొదట రూ.10 లక్షలు ఇచ్చారు. మళ్లీ డబ్బులు కావాలని లేదంటే.. చనిపోతానని బెదిరించి విడతల వారిగా కోటిన్నర వసూలు చేశాడు. అయితే గౌతం వేధింపులు తాళలేక బాధిత యువతి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సుజ్లాన్ రాకతో ఏపీ రెన్యువబుల్ ఎనర్జీ పెరిగింది

**- పవన విద్యుత్ రంగంలో సుజ్లాన్‌కు ప్రపంచ ఖ్యాతి - 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యం - ఏపీ వ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీలో 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం - ఏపీ-సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ - అనంతపురం అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యువబుల్ ఎనర్జీ - రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్**

**రాయదుర్గం, (రాజధాని వార్తలు):** పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఏపీ నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు అనంతపురం జిల్లాలో మీ అందరి మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యాయానికి నాంది. ఈ రోజు సుజ్లాన్, ఏపీ మధ్య రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న బంధాన్ని పునరుద్ధరించుకునే సందర్భం కూడా. సుజ్లాన్ తొలినాళ్లలోనే ఏపీకి వచ్చి, తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసి, బలమైన విండ్ ఎనర్జీ ఎకో సిస్టమ్ నిర్మించింది. సుజ్లాన్ గురించి మాట్లాడేటప్పుడు దివంగత తులసి తంతి గారిని మనం స్మరించుకోవాలి. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారక ముందే ఆయన పునరుత్పాదక ఇంధనంపై నమ్మకం ఉంచారు. ఆయన ఆలోచన చాలా సింపుల్. భారతదేశ ఆర్థిక స్వావలంబనకు ఇంధన స్వావలంబన అత్యంత అవసరం. ఆ దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడింది.

**అనంతలో 1,260 మెగావాట్ల సామర్థ్యం సుజ్లాన్ సొంతం**

2019–24 మధ్య రాష్ట్రంలో పవన విద్యుత్ అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. కేవలం 6 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం మాత్రమే అదనంగా చేరింది. నేడు అనంతపురంలోని సుజ్లాన్ యూనిట్‌కు ఏడాదికి సుమారు 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉంది. ప్రత్యక్షంగా సుమారు 1,200 మందికి ఉపాధి కల్పిస్తోంది. వారిలో 70 శాతానికి పైగా స్థానికులే. ఏపీ వ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలను సృష్టించింది. పారిశ్రామికీకరణ అంటే ఇలాగే ఉండాలి. ఒక జిల్లాకు పెట్టుబడులు రావాలి. ఆ జిల్లాలో తయారీ రంగం అభివృద్ధి చెందాలి. ఆ జిల్లాలో నైపుణ్యాలు పెరగాలి. యువతకు వారి సొంత జిల్లాలోనే ఉద్యోగాలు లభించాలి.

**విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటింది సుజ్లాన్**

భారతదేశ పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థల్లో సుజ్లాన్ ఒకటి. పట్టుదల, పునరుద్ధరణ సామర్థ్యంతో సుజ్లాన్ సంస్థ అత్యున్నత విజయాలను చూసింది. అత్యంత క్లిష్టమైన పరిస్థితులను కూడా ఎదుర్కొంది. అయినప్పటికీ సుజ్లాన్ ఎప్పుడూ కనుమరుగుకాలేదు. ఎందుకంటే నిబద్ధతతో కూడిన ఈ సంస్కృతిని తులసి తంతి గారు ఏర్పరచగా, ప్రస్తుత నాయకత్వం దానిని ముందుకు తీసుకెళ్లింది.




**రూ.10 వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ఉద్యోగాల కల్పన**

ఈ రోజు మనం ముందుకు తీసుకెళ్తున్న ప్రాజెక్టులు మొత్తం 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం. సుమారు రూ.10 వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను తీసుకు రానున్నాయి. మనం నిర్మించే ప్రతి మెగావాట్ చివరికి మన యువతకు అవకాశంగా మారాలి. ఏపీలో సుజ్లాన్‌కు ఇప్పటికే సుమారు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2,700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. అనంతపురం ప్రాంతంలో సుమారు 1,300 మెగావాట్ల కొత్త పవన విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి.

**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు.

**175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం**

మా విజన్ కేవలం విద్యుత్‌తో ఆగిపోదు. క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చాలని మేం కోరుకుంటున్నాం. గ్రీన్ డేటా సెంటర్ల ద్వారా ఏఐ ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ అందించాలని కోరుకుంటున్నాం. చివరికి క్లీన్ ఎనర్జీకి సౌది అరేబియాగా ఏపీని తీర్చిదిద్దాలన్నదే మా అంతిమ లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. మనకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. ఓడరేవులు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ల్యాండ్ ఉంది. మెరుగైన కనెక్టివిటీ ఉంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయి. ఈ ప్రయోజనాలన్నింటినీ ఒకచోటకు తీసుకు రావడానికి అవసరమైన పాలసీ ఎన్విరాన్‌మెంట్‌ను మేం సృష్టిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి.

**రాష్ట్ర వ్యాప్తంగా 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం**

పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మాణంలో భాగంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు దిశగా ముందుకు వెళ్తున్నాం. క్లస్టర్లు ఎందుకంటే.. కంపెనీలు ఒంటరిగా పెట్టుబడులు పెట్టవు. అవి ఎకోసిస్టమ్ లో పెట్టుబడులు పెడతాయి. అందుకే మా విధానం చాలా సులభం. కేవలం ఒక కంపెనీని తీసుకురావడం కాదు.. ఆ కంపెనీ చుట్టూ పూర్తి ఎకోసిస్టమ్‌ను నిర్మించాలి. ఒక కంపెనీ సప్లయర్స్ ను తీసుకొస్తుంది. సప్లయర్స్ మరిన్ని కంపెనీలను తీసుకొస్తారు. కంపెనీలు ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఉద్యోగాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీంతో పెద్దఎత్తున పెట్టుబడులు తరలి వస్తాయి.

**ఏపీ-సుజ్లాన్ భాగస్వామ్యంతో 12వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

ఈ భాగస్వామ్యంలో గర్వంగా అనిపించే మరో అంశం నైపుణ్యాభివృద్ధి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25 శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువత సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ తులసి తంతి గారి వారసత్వం మరోసారి కొనసాగుతోంది.

**అనంతపురం కొత్త కేరాఫ్ అడ్రస్ ఇదే..**

అనంతపురం జిల్లా అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యూవబుల్ ఎనర్జీ. ఒకప్పుడు అనంతపురం జిల్లా నుంచి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగాలు వెతుక్కుంటూ అనంతపురం జిల్లాకు వచ్చే రోజులు వచ్చాయి. ఇదంతా మన ఏపీ బ్రాండ్, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి వల్లే సాధ్యమైంది.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం**

ఒక్క కియా పరిశ్రమ ఎన్ని కుటుంబాల్లో వెలుగు నింపిందో నేను పాదయాత్రలో స్వయంగా చూశాను. అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలి అనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రపంచమంతా తిరిగి కంపెనీలను తీసుకువస్తున్నాం. మన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా మన రాష్ట్రానికి కంపెనీలను తీసుకురావడానికి సహకరిస్తున్నారు. కంపెనీలను తీసుకురావడం మా బాధ్యత. ఆ అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత. మీ పని తీరుబట్టే మరిన్ని కంపెనీలు ఏపీకి వస్తాయి. అందుకే నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. పరిశ్రమలతో నేరుగా అనుసంధానం చేసి, యువతకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించాలని కోరుతున్నాం.

**మన భవిష్యత్ మనమే నిర్మించుకుందాం**

ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేసినప్పుడు ఎంత అద్భుత ఫలితాలు వస్తాయో మనం చూస్తున్నాం. పరిశ్రమలు పెట్టుబడులు, సాంకేతికతను తీసుకువస్తాయి. మన యువత ప్రతిభను, ఆశయాలను తీసుకువస్తారు. మనమంతా కలిసి అభివృద్ధిని సృష్టిస్తాం. ఏపీపై విశ్వాసం ఉంచిన గిరీష్ తంతి, అజయ్ కపూర్ కు, మొత్తం సుజ్లాన్ బృందానికి ధన్యవాదాలు. ఈ రోజు మనం కేవలం పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూమిపూజ చేయడం లేదు. ఇంధనం, తయారీ, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా నిర్మించబోయే కొత్త పారిశ్రామిక ఆంధ్రప్రదేశ్‌కు పునాది వేస్తున్నాం.

ఈ రోజు ఇక్కడ ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి, పారిశ్రామికవేత్తలకు ప్రముఖుడికి నా సందేశం ఒక్కటే.. మా స్పీడ్, స్టెబిలిటీ, కమిట్ మెంట్, ఎగ్జిక్యూషన్ ను నమ్మండి. ఎందుకంటే మీరు ఏపీలో విజయవంతమైతే, ఏపీ కూడా మీతో కలిసి విజయవంతమవుతుంది. భవిష్యత్తు కోసం మనం ఎదురు చూడబోం. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించబోతున్నాం అని మంత్రి చెప్పారు.

## సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారానే ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగును నివారించ వచ్చు: లాం వ్యవసాయ శాస్త్రవేత్త రాజేష్



**గుంటూరు, (రాజధాని వార్తలు):** సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారానే ప్రత్తి పంటలో గులాబీ రంగుపురుగును నివారించవచ్చని లాం వ్యవసాయ శాస్త్రవేత్త రాజేష్ చౌదరి పేర్కొన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ శాఖ, ల్యాంప్ మరియు కారుణ్య సేవాసంస్థల ఆధ్వర్యంలో, ఎల్‌డిసి సంస్థ సహకారంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పత్తి రైతులకు గులాబీ రంగు పురుగు నివారణపై నిర్వహించిన ఆ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ల్యాంప్ మరియు కేవైఆర్టి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం మంచి పరిణామం అన్న ఆయన పత్తిలో ఏ విధమైన యాజమాన్యం పద్ధతులుఅవలంబించాలి అనేదానిపై మాట్లాడుతూ, ఈ సమయంలో గులాబీ రంగు పురుగు వచ్చే అవకాశం ఉందని రైతుల విత్తిన 45 రోజుల నుండి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించాలని, అనంతరం లింగాకర్షణ బుట్టలు అమర్చి వరుసగా మూడు రోజులు బుట్టలతోఎనిమిది తల్లి రెక్క పురుగులు పడటం గమనించిన వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, పొలంలో గడ్డి పూలు ఎప్పటికప్పుడు ఏరి నాశనం చేయాలని, మందులు ఉదయం పూట పదిగంటలోపు, సాయంత్రం ఏడు గంటలలోపు పిచికారి చేయాలన్నారు. గులాబీ రంగు పురుగును గుడ్డు దశలోనే వేపగింజల కషాయం మరియు ప్రొఫెనోఫాస్ ను పిచికారీ చేసి నివారించుకోవాలని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఎం.పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని, ఎల్ నినో ప్రభావం అధికం గా ఉన్నందున తక్కువ నీటితో, తక్కువ కాల వ్యవధిలో పండే పంటలు సాగు చేయాలని, జిల్లాలో ఎరువులకు కొరత లేదని, రైతులు ఏపిఏఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువులు పొందాలని తెలిపారు. ఎల్ డి సి సంస్థ ప్రతినిధి అఖిలేష్ మాట్లాడుతూ పత్తి నాణ్యతనుపెంచుకోవడానికి గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు పంపిణీ చేస్తున్నామని వారు చెప్పారు. ప్రత్తి పంటను జనవరి తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ చేనులో ఉంచకూడదు అని, పంటకు నీరు, ఎరువులు పెట్టి పంట కాలాన్ని పొడిగించకూడదని, పత్తిలో నాణ్యతను పెంచుకోవడానికి ఈ లింగాకర్షణ బుట్టలు విరివిగా రైతులు వాడాలని వారు పేర్కొన్నారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ కారుణ్య సంస్థ ప్రతినిధి మధుసూదన్ రావులు మాట్లాడుతూ మరిన్ని కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామని వారు చెప్పారు. గుంటూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.మోహన రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ప్రత్తి పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, బెట్టపరిస్థితులకు ప్రత్తిలో మల్టీ కె ఎకరానికి ఒక కేజీ పిచికారీ చేయాలనీ, గ్రోత్ ప్రమోటార్స్ వాడాలని చెప్పారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంవలన సాగు నీరు ఇవ్వనందున తక్కువ నీటి వనరులతో పండే ఆరు తడి పంటలు సాగుచేయాలని, మిల్లెట్స్ పంటలు వేసుకోవాలని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటలు గురించి వివరించారు, ఎల్‌డిసి సంస్థ అసిస్టెంట్ మేనేజర్ యు.ప్రమోద్ లింగాకర్షక బుట్టల వినియోగంపై డెమో నిర్వహించి రైతులకు అవగాహన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుగుణబేగం మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ ఐడి తీసుకోవాలని, ఫార్మర్ యాప్ రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు మండలాలకు చెందిన 150 మంది రైతులకు లింగాకర్షక బుట్టలు ఉచితంగా పంపిణీ చేయడం చేశారు. ఈ కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, సన్నీ, వై.శౌరయ్య, టి.మంగయ్య, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 27, 28 తేదీల్లో అసెంబ్లీ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సమావేశం

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఈనెల 27, 28 తేదీల్లో అసెంబ్లీ కమిటీ హాల్లో ఆంధ్రప్రదేశ్ శాసన సభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ సమావేశం కానుందని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ తెలియజేశారు.వాస్తవానికి ఈకమిటీ సమావేశం ఈనెల 26, 27 తేదీల్లో జరగాల్సి ఉండగా 26వతేదీ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈసమావేశాన్ని ఈనెల 27, 28 తేదీలకు మార్పు చేశారు. ఈ కమిటీ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థల (పబ్లిక్ అండర్ టేకింగ్స్ (పిఎస్ యులు)కు సంబంధించి గత ఐదేళ్ళ వార్షిక నివేదికలు మరియు జనరల్ యాక్టివిటీలను సమీక్షించ నుందని పేర్కొన్నారు. 27వ తేది గురువారం ఉ.10 గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్ 1లో సమగ్ర శిక్ష, ఎపి అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజిమెంట్ లిమిటెడ్‌లపైన, మధ్యాహ్నాం 2 గం.లకు ఎపి స్టేట్ డిజాస్టర్ మేనేజిమెంట్ అథారిటి పైన తదుపరి ఎపి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపి ఇడబ్ల్యుఐడిసి)లపైన అసెంబ్లీ కమిటీ సమీక్షిస్తుందని సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ తెలియజేశారు. 28వ తేది ఉ. 10 గం.లకు ఎపి ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపిఐఐసి), ఎపి స్టేట్ రోడ్డు రవాణా సంస్థ (ఎపిఎస్ఆర్టీసి), ఎపి స్టేట్ హేండ్ లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటి (ఆప్కో)లపై కమిటీ సమీక్షిస్తుందన్నారు.

అదే విధంగా మధ్యాహ్నాం 2గం.ల నుండి ఎపి ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు (ఎపి కెవిఐబి), ఎపి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్‌లపై సమీక్షిస్తుందని తెలిపారు.

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం విజయవాడ లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆయనతో ఏపీ లోకాయుక్తగా ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై జస్టిస్ మల్లిఖార్జునరావుకు అభినందనలు తెలిపారు. లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లోక్ భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు గవర్నర్, ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## రొయ్యుల చెరువులో కూలీ అనుమానాస్పద మృతి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** తెల్లవారకముందే పొట్టకూటి కోసం పనికి వెళ్లిన ఒక శ్రామికుడు కొన్ని గంటల్లోనే రొయ్యల చెరువులో శవమై తేలడంతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరంలో తీవ్ర విషాదం అలుముకుంది. బోడసకుర్రు పల్లిపాలెంకు చెందిన ఓలేటి రాజు (40) రోజూలాగే కుటుంబ పోషణ కోసం సోమవారం ఉదయం సమయంలో చెరువు పనుల నిమిత్తం రొయ్యల చెరువు యజమాని రాజును తన నివాసం నుంచి తొండవరంలోని చెరువు వద్దకు తీసుకెళ్లారని బంధువులు తెలిపారు. వెళ్లిన కొద్దిసేపటికే రాజు రొయ్యల చెరువులో నిర్జీవంగా కనిపిస్తాడని కలలో కూడా ఊహించలేదని కుటుంబ సభ్యుల బోరున విలపించారు. హఠాన్మరణంతో రాజు కుటుంబం ఒక్కసారిగా గుండెకోతకు గురైంది. తెల్లవారుజామున నవ్వుతూ పనికి వెళ్లిన మనిషి తిరిగి రాని లోకాలకు పోయాడన్న వార్త వినగానే బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అయితే రాజు మృతిపై బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పనికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే చెరువులో శవమై కనిపించడం వెనుక ఏదో అనుమానం ఉందంటూ సంఘటనా స్థలంలోనే చెరువు యజమానికి, బంధువులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక సామాన్య కుటుంబానికి ఆధారమైన వ్యక్తి ఇలా అనుమానాస్పద స్థితిలో ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో ఉద్రిక్తతతో పాటు విషాద ఛాయలు అలుముకున్నాయి. బాధితు లకు న్యాయం జరగాలని ఘటనపై విచారణ జరిపి నిజానిజాలు బయట పెట్టాలని రాజు కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# రెండేళ్లలో స్వర్ణాంధ్ర @ 2047కి బాటలు.. డేటా ఆధారిత అభివృద్ధి, సమర్థ పాలనకు ఏపీఎస్‌డీపీఎస్ కీలక భూమిక

## - 175 నియోజకవర్గాల నుంచి 28 జిల్లాల వరకు.. అభివృద్ధికి డేటా ఆధారిత ప్రణాళిక - విజన్ నుంచి గ్రౌండ్ యాక్షన్ వరకు

**అమరావతి, (రాజధాని వార్తలు):** దీర్ఘకాలిక అభివృద్ధి హామీలను క్షేత్రస్థాయి వాస్తవాలుగా మార్చే బలమైన ప్రయత్నంలో భాగంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తన ప్రతిష్టాత్మక 'స్వర్ణాంధ్ర ఏ2047' రోడ్ మ్యాప్ కోసం 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ'ని కేవలం రెండేళ్ల వ్యవధిలోనే ప్రధాన అమలు సాధనంగా తీర్చిదిద్దింది. ముఖ్యమంత్రి 'పది సూత్రాల' మార్గదర్శకత్వంలో, 2047 నాటికి రాష్ట్రం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను, తలసరి ఆదాయం రూ. 55 లక్షలకు చేర్చాలని, 15 శాతం లేదా అంతకంటే ఎక్కువ స్థిరమైన వార్షిక వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో నాలుగు ప్రధాన విభాగాలు – కెపాసిటీ బిల్డింగ్, ఎకనామిక్ అండ్ పాలసీ రీసెర్చ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నీతి ఆయోగ్ కింద 'స్టేట్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్' ద్వారా పనిచేస్తూ, ఆశాజనకంగా విధానపరమైన ప్రణాళికలను రోజువారీ పరిపాలనగా మారుస్తోంది. ఐఐఎం అహ్మదాబాద్, కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ భాగస్వామ్యంతో ఏపి నాలెడ్జ్ సొసైటీ అండ్ కెపాసిటీ బిల్డింగ్ పాలసీ 2025' కింద ప్రారంభించిన జిఓటి కర్మయోగి పాలసీ ద్వారా పరిపాలనా సంస్కరణల్లో ఒక ప్రధాన మైలురాయి నమోదైంది. క్రమబద్ధమైన జిల్లా పర్యవేక్షణ, రియల్–టైమ్ డాష్‌బోర్డ్‌ల ద్వారా 8.2 లక్షల మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను కవర్ చేస్తూ, 1.85 కోట్ల ఎన్‌రోల్‌మెంట్లలో 1.52 కోట్లకు పైగా కోర్సులను పూర్తి చేసి జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ 2వ ర్యాంకు సాధించింది. ఇందులో పాఠశాల విద్యా శాఖ 58.09 లక్షల కోర్సులు పూర్తి చేసి ముందు వరుసలో నిలవగా, పంచాయతీరాజ్ 14.10 లక్షలు, పోలీసు శాఖ 13.27 లక్షలు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 10.63 లక్షలు, ప్రజా రవాణా సంస్థ 4.38 లక్షల కోర్సులతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కోడ్ ఆఫ్ కండక్ట్, హార్ట్ ఇన్ గవర్నెన్స్, మిషన్ లైఫ్ వంటి ఫంక్షనల్, బిహేవియరల్ మాడ్యూల్స్‌లో అత్యధిక కోర్సులు పూర్తి కావడం, బాధ్యతాయుతమైన, పౌరులకు మొదటి ప్రాధాన్యతనిచ్చే ప్రజా సేవ వైపు వస్తున్న ప్రాథమిక సాంస్కృతిక మార్పును ప్రతిబింబిస్తుంది. అత్యుత్తమ పరిపాలనను సంస్థాగతం చేసేందుకు, హార్వర్డ్ కెన్నెడీ స్కూల్, ఆక్స్‌ఫర్డ్ బ్లావత్నిక్ స్కూల్, లీ కువాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ వంటి ప్రపంచ స్థాయి సంస్థల ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్'ను ప్రభుత్వం స్థాపిస్తోంది. ప్రయోగాత్మక విధానాలు, డేటా ఆధారిత పరిష్కారాలను నడిపించేందుకు ఈ సంస్థలో 'ఆంధ్ర గవర్నెన్స్ ఇన్నోవేషన్ ల్యాబ్' కూడా ఏర్పాటు కానుంది. మొత్తం 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల' ప్రారంభంతో క్షేత్రస్థాయిలో సేవల పంపిణీ వ్యవస్థ పూర్తిగా మెరుగుపడింది. స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలతో కూడిన ఈ తొమ్మిది మంది సభ్యుల యూనిట్లలో 175 మంది శిక్షణ పొందిన యువ నిపుణులు లైవ్ డాష్‌బోర్డ్‌ల ద్వారా 600కి పైగా అభివృద్ధి సూచికలను ట్రాక్ చేస్తున్నారు. రాష్ట్రంలో తొలిసారిగా, ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక నియోజకవర్గ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి పి4 జీరో పావర్టీ ప్రోగ్రామ్ కింద గ్రామాలను దత్తత తీసుకోవడం, బంగారు కుటుంబాలను గుర్తించడం, పిజిఆర్ఎస్ పోర్టల్ ద్వారా స్థానిక సమస్యలను నేరుగా పరిష్కరించడం వంటి వాటిని పర్యవేక్షిస్తున్నాయి. ఉన్నత స్థాయిలో, పరిపాలన ఒక ఆధార సహితమైన క్లోజ్డ్–లూప్ రివ్యూ మెకానిజంకు మారింది. స్వర్ణాంధ్ర పోర్టల్ నుండి ఆర్థిక సాధన సూచికలను, ఆర్‌టిజిఎస్ ద్వారా 45 ప్రభుత్వ ప్రచారాలపై ప్రజల ఫీడ్‌బ్యాక్‌ను, పిజిఆర్ఎస్ నుండి సమస్యల పరిష్కార సామర్థ్యాన్ని అనుసంధానం చేస్తూ ముఖ్యమంత్రి అన్ని 28 జిల్లాల సమీక్షలను ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు లేవనెత్తే క్షేత్రస్థాయి సమస్యలను కేంద్రీకృత రివ్యూ ట్రాకర్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అధికారిక జీవోలు జారీ చేయడానికి ముందే సంబంధిత విభాగాలు 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్స్' సమర్పించాల్సి ఉంటుంది. రాష్ట్ర విధాన ఎజెండాలో భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన సామాజిక, ఆర్థిక వ్యూహాలు కూడా భాగమయ్యాయి. జనాభా నిర్వహణ విధానం 2026, 'పిల్లలే సంపద' ఫ్రేమ్‌వర్క్ కింద, ప్రభుత్వం మాతృత్వ, సంజీవని, శక్తి, క్షేమ, నైపుణ్యం అనే ఐదు ప్రధాన మూల స్తంభాలపై దృష్టి సారించింది. ఆర్థిక రంగంలో, తిరుపతిలో జరిగిన ఒక ఉన్నత స్థాయి సదస్సులో నీతి ఆయోగ్, NCAER, KPMG లు ఏకమై రూ. 308 లక్షల కోట్ల విజన్ లక్ష్యాన్ని సాధించే వ్యూహాలను రూపొందించాయి. ఇందులో భాగంగా ఏఐ ఆధారిత గ్రాస్ వాల్యూ యాడెడ్ అంచనాలు, జీఎస్‌డిపి నౌక్యాస్టింగ్ పైలట్ ప్రాజెక్ట్‌లు, అమరావతిలో సర్వీసెస్ ట్రేడ్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు.

ఈ ఆచరణాత్మక సంస్కరణలు క్షేత్రస్థాయి సంస్థలకు కూడా విస్తరించాయి. టిటిడి, ఐఐఎం అహ్మదాబాద్‌లతో కలిసి, 2,500 మందికి పైగా రోజువారీ సేవకుల కోసం 12 మాడ్యూల్స్, సూపర్వైజర్ ట్రైనింగ్‌తో కూడిన పాఠ్యాంశాల ద్వారా తిరుమలలోని శ్రీవారి సేవ కార్యక్రమాన్ని ఆశాజనకంగా సమూలంగా మార్చింది. కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద కుప్పంలో జరిగిన ఒక సమగ్ర అధ్యయనం, సమర్థవంతమైన పేదరిక నిర్మూలనను, 16,800కు పైగా ప్రజా సమస్యలలో కేవలం 1.74 శాతం గ్రీవెన్స్ రీఓపెన్ రేటును హైలైట్ చేసింది. అలాగే సింగపూర్‌తో అర్బన్ గవర్నెన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒప్పందం ద్వారా అంతర్జాతీయ సంబంధాలను ప్రభుత్వం విస్తరించుకుంది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీతో కలిసి అధికారిక 'స్టేట్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్'గా పనిచేసేందుకు నీతి ఆయోగ్ యొక్క స్టేట్ సపోర్ట్ మిషన్ కింద రూ. 1.61 కోట్లను ప్రభుత్వం సాధించింది. డేటా ఆధారిత పర్యవేక్షణ, వ్యవస్థాగత నైపుణ్యాల పెంపు, అడుగడుగునా జవాబుదారీతనం ద్వారా స్వర్ణాంధ్ర ఏ2047 అనేది కేవలం ఒక విజన్ స్టేట్‌మెంట్ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్న, కొలవదగిన వాస్తవం అని కూటమి ప్రభుత్వం నిరూపిస్తోంది.

# ఏపీ మున్సిపల్ శాఖ - యూకే ప్రభుత్వాల మధ్య కీలక ఒప్పందం

## - పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధికి గవర్నమెంట్ - గవర్నమెంట్ ఎంఓయూ - అమరావతిని వరల్డ్ క్లాస్ స్మార్ట్, లివబుల్ సిటీగా అభివృద్ధి చేయడంలో యూకే నైపుణ్యం, సాంకేతిక సహకారం - సస్టైనబుల్ అర్బన్ డెవలప్‌మెంట్, ఆధునిక టెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీపై కలిసి పనిచేయనున్న ఏపీ-యూకే - మునిసిపాలిటీల్లో రూ.40 వేల కోట్ల మౌలిక వసతుల పనులకు ప్రపంచస్థాయి సాంకేతికత వినియోగం : మీడియాతో మంత్రి నారాయణ



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధిని అంతర్జాతీయ నైపుణ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, సుస్థిర మౌలిక వసతులతో మరింత ముందుకు తీసుకెళ్లే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం–యునైటెడ్ కింగ్డమ్ ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం మంగళవారం అమరావతిలో కుదిరింది. వెలగపూడిలోని సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, యూకే ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఫర్ బిజినెస్ అండ్ ట్రేడ్ గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా ఒప్పందంపై సంతకాలు చేశారు. పురపాలక పరిపాలన, పట్టణా భివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ నాయకత్వంలో ఏపీ ప్రతినిధి బృందం, యూకే ప్రతినిధి బృందం కార్యక్రమంలో పాల్గొన్నాయి.

**అమరావతితో పాటు రాష్ట్ర పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం**

ఈ భాగస్వామ్యంలో అమరావతి కీలక సహకార రంగంగా నిలవనుంది. ఆధునిక, సుస్థిర, పర్యావరణహిత, మెరుగైన కనెక్టివిటీతో ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి యూకే నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం మరింత బలం చేకూర్చ నుంది. అమరావతితో పాటు రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ఈ సహకారం ఉపయోగపడనుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ప్రాథమిక మౌలిక వసతులను మరింత సమర్థవంతంగా అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను టేకప్ చేసి, అనేక పనులకు టెండర్లు పిలిచి అమలు చేస్తున్నామని మంత్రి పి.నారాయణ తెలిపారు. ఈ పనుల్లో యూకేకు చెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఉత్తమ విధానాలను వినియోగించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందన్నారు.

**నాలుగు ప్రధాన రంగాల్లో సహకారం**

ఆంధ్రప్రదేశ్–యూకే భాగస్వామ్యం ప్రధానంగా మౌలిక వసతుల ప్రణాళిక, సుస్థిర పట్టణాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ–ఆవిష్కరణలు, సమగ్ర పట్టణ రవాణా వ్యవస్థలపై కొనసాగనుంది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రణాళిక, ప్రాధాన్యత క్రమం, ఆర్థిక సాధ్యాసాధ్యాల అంచనా, పెట్టుబడులకు అనుకూలమైన బిజినెస్ కేసుల రూపకల్పన, ప్రాజెక్ట్ డిజైన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, అమలు వంటి అంశాల్లో ఇరు ప్రభుత్వాలు కలిసి పనిచేయనున్నాయి. రాష్ట్రంలోని నగరాలను మెరుగైన అర్బన్ స్ట్రక్చర్‌తో స్మార్ట్, లివబుల్ సిటీలుగా తీర్చిదిద్దేందుకు యూకే నైపుణ్యాన్ని వినియోగించుకోనున్నారు. సుస్థిర పట్టణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఆధునిక పట్టణ ప్రణాళిక, సమర్థవంతమైన మౌలిక వసతుల రూపకల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**అమరావతి అభివృద్ధిలో యూకే నైపుణ్యం**

అమరావతి అభివృద్ధిలో యూకే సంస్థలతో ఇప్పటికే ఏర్పడిన అనుసంధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. లండన్‌కు చెందిన ఫోస్టర్ ం పార్ట్‌నర్స్ సంస్థ అమరావతి ప్రభుత్వ సముదాయంలోని అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాల రూపకల్పనలో భాగస్వామ్యం కావడం ఇరు పక్షాల మధ్య ఉన్న సహకారానికి ఉదాహరణగా నిలుస్తోంది. అమరావతి తదుపరి దశ అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక, సుస్థిర మౌలిక వసతులు, పట్టణ రవాణా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రాజెక్టుల రూపకల్పన, అమలు తదితర రంగాల్లో యూకే నైపుణ్యాన్ని మరింతగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. అమరావతి రివర్‌ఫ్రంట్, పట్టణ పునరుద్ధరణ, మిశ్రమ వినియోగ అభివృద్ధి వంటి రంగాల్లోనూ అంతర్జాతీయ అనుభవాన్ని వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయి.

**ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం**

సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, ఆవిష్కరణలకు ఈ ఒప్పందంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, డిజిటల్ ట్విన్స్, ఆధునిక నిర్మాణ సాంకేతికతలు, పరిశోధన–అభివృద్ధి వంటి రంగాల్లో సహకారం అందించనున్నారు. యూకేలోని వివిధ సంస్థల అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రానికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వ సంస్థల సామర్థ్యాన్ని పెంచడం, నిపుణుల మధ్య జ్ఞాన మార్పిడిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పట్టణ రవాణా వ్యవస్థలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఏపీ–యూకే కలిసి పనిచేయనున్నాయి. మెట్రో రైలు, బస్సు వ్యవస్థలు, విమానాశ్రయాల అనుసంధానం, పాదచారుల మౌలిక వసతులు, డేటా ఆధారిత రవాణా ప్రణాళిక వంటి అంశాలపై సహకారం కొనసాగనుంది. దీని ద్వారా పట్టణాల్లో కనెక్టివిటీ మెరుగుపరచడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం, ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పెట్టుబడుల సమీకరణకు అవకాశాలు**

మౌలిక వసతుల ప్రాజెక్టులకు కొత్త ఆర్థిక నమూనాలు, పెట్టుబడుల సమీకరణ అవకాశాలను కూడా ఈ ఒప్పందం కల్పిస్తుంది. అర్హత కలిగిన ప్రాజెక్టులకు నిర్దేశిత ఆర్థిక అర్హతలు, డ్యూ డిలిజెన్స్, యూకే కంటెంట్ తదితర నిబంధనలకు లోబడి యూకే ఎక్స్‌పోర్ట్ ఫైనాన్స్ ద్వారా ఆర్థిక సహాయం పొందే అవకాశాలను పరిశీలించవచ్చు. ఈ సందర్భంగా పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, యూకే డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేయడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నగరాలను లివబుల్ సిటీలుగా, స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేయడానికి యూకే సహకారం అందించనుందని తెలిపారు. బెస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్, సస్టైనబుల్ సిటీస్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇంటిగ్రేటెడ్ అర్బన్ మొబిలిటీ వంటి రంగాల్లో ప్రత్యేకంగా సహకారం అందనుందని చెప్పారు. యూకేలోని వివిధ కంపెనీల బెస్ట్ ఎక్స్‌పర్టైజ్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకు రావడం, ప్రపంచస్థాయి టెక్నాలజీ, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను రాష్ట్రంలో అమలు చేయడం ఈ భాగస్వామ్యం ద్వారా సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ అమరావతి ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, హైకోర్టు డిజైన్‌లో భాగస్వామ్యం కావడం ఇప్పటికే ఉన్న సహకారానికి నిదర్శనమన్నారు. యూకేలో ఉన్న అత్యుత్తమ నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు ఈ ఒప్పందం మరింత అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సాంకేతిక సహకారం అందించేందుకు యూకే ప్రతినిధులు ముందుకు వచ్చారని, యూకే డిప్యూటీ హై కమిషనర్, బిజినెస్ విభాగం డైరెక్టర్ జనరల్ సహా ప్రతినిధులు అమరావతికి వచ్చి రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకే యూకే ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచంలోని టాప్ ఫైవ్ సిటీల్లో ఒకటిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి లక్ష్యంలో భాగంగా ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను అమరావతి అభివృద్ధిలో వినియోగించుకోవడమే లక్ష్యమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ప్రాథమిక మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి తెలిపారు. రోడ్లు, డ్రైన్లు, వాటర్ సప్లై, సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తదితర రంగాల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.40 వేల కోట్ల విలువైన పనులను చేపట్టామని, యూకే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటే ఈ పనులను మరింత మెరుగైన ప్రమాణాలతో పూర్తి చేసే అవకాశం ఉంటుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ విజయ రామరాజు, ఐఏఎస్; ఏపీసీఆర్డీఏ అదనపు కమిషనర్ రాహుల్, సీడీఎంఏ, ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యూకే ప్రతినిధి బృందంలో దక్షిణాసియా ట్రేడ్ కౌన్సిలర్ మార్క్ బిర్రెల్, డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, నేషనల్ లీడ్–ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిషికేష్ చందా, సౌత్ ఇండియా రీజినల్ హెడ్–ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోహిత్ చంద్రగిరి, గవర్నమెంట్ పార్ట్‌నర్‌షిప్స్ డిప్యూటీ డైరెక్టర్ చాజ్ వాలియా పాల్గొన్నారు.

# ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్'కు డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి అవార్డు - 2026 : 'డాక్టర్ వైఎస్సార్ & డాక్టర్ కేవీపీ ఫౌండేషన్'

దేశ వ్యవసాయ రంగం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాలలో అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా 'ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్' (ఎంఎస్ఎస్ఆర్ఎఫ్) కు 'డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి అవార్డు – 2026'ను ప్రకటించారు. ఈ అవార్డు కింద రూ. 25 లక్షల నగదు బహుమతిని అందజేస్తారు. 2026 సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలోని 'కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా'లో నిర్వహించే కార్యక్రమంలో ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ తరఫున ఆ సంస్థ ఛైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ఈ అవార్డును స్వీకరిస్తారు. భారతరత్న, దివంగత డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ మహోన్నత వారసత్వాన్ని ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ కొనసాగిస్తోంది. ఆయన శాస్త్రీయ నాయకత్వం మన దేశ హరిత విప్లవంలో, దేశాన్ని ఆహార కొరత నుంచి ఆహార స్వయం సమృద్ధి దిశగా నడిపించడంలో చారిత్రాత్మక పాత్ర పోషించింది. దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నాయకత్వంలో, ఆమె రాజకీయ సంకల్పం, వ్యవసాయ రంగానికి అందించిన బలమైన మద్దతు, డాక్టర్ స్వామినాథన్ సైంటిఫిక్ విజన్, భారతీయ రైతుల కృషి కలిసి దేశ ఆహార భద్రతకు బలమైన పునాదులు వేశాయి. సుస్థిర వ్యవసాయం, ఆహార–పోషకాహార భద్రత, జీవవైవిధ్యం, గ్రామీణ జీవనోపాధి రంగాలలో విజ్ఞాన ఫలాలను రైతులకు, గ్రామీణ ప్రజలకు అందిస్తూ ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ ఈ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి ప్రజా సంక్షేమ ఆశయాలను, రైతుపక్షపాత ఆలోచనలను కొనసాగించేందుకు 'డాక్టర్ వైఎస్ఆర్ & డాక్టర్ కేవీపీ ఫౌండేషన్' స్థాపించబడింది. వైఎస్సార్ ప్రజా జీవితం నిరంతరం రైతులు, పేదలు, సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగింది. ఈ నేపథ్యంలో వ్యవసాయం, నీటిపారుదల, వైద్యం, విద్య వంటి రంగాలలో విశేష సేవలందించిన ప్రముఖ వ్యక్తులను, సంస్థలను సత్కరించడం, సమాజ పురోగతికి ఉపయోగపడే వ్యవసాయం తదితర కోర్సులలో ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూతనందించడం, సామాజిక సేవకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఫౌండేషన్ ముందుకు సాగుతున్నది. ఫౌండేషన్ చేపడుతున్న అవార్డులు, స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ కార్యక్రమాలన్నీ డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి స్మృత్యర్థం నిర్వహిస్తున్నవే. ఆయన జీవితంలో చూపించిన కరుణ, ప్రజాసేవ, సమగ్ర అభివృద్ధి విలువల ఆధారంగా ఇవి కొనసాగుతున్నాయి. 2025లో ఈ ఫౌండేషన్ ప్రయాణం ప్రారంభమైంది. తొలి అవార్డును సుస్థిర, ప్రకృతి వ్యవసాయంలో విశేష కృషి చేసిన 'సుభాష్ పాలేకర్ కృషి' (ఎస్పీకే) కి ప్రధానం చేశారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ ఎస్పీకే తరఫున రూ. 25 లక్షల నగదు అవార్డును స్వీకరించారు. అదే కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం, పరిశోధనలలో చేసిన కృషికి గాను 'శ్రీ పద్మావతి వెంకటేశ్వర ఫౌండేషన్'ను గౌరవంగా సత్కరించారు. ఈ సత్కారాన్ని ఫౌండేషన్ తరఫున డాక్టర్ చదలవాడ సుధ, డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు స్వీకరించారు.

2026లో, ఫౌండేషన్ 'ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రూ. 21 లక్షలతో నిధిని (స్కాలర్‌షిప్ కార్పస్) ఏర్పాటు చేసింది. దీని ద్వారా ప్రతి సంవత్సరం యూనివర్సిటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తారు. వీటితో పాటు సమాజ సంక్షేమానికి కట్టుబడి సేవ చేస్తున్న పలువురు వ్యక్తులకు, సామాజిక కార్యక్రమాలు చేపట్టే సంస్థలకు కూడా ఫౌండేషన్ మద్దతుగా నిలుస్తోంది. 'డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి అవార్డు – 2026' ద్వారా గ్రామీణ భారతానికి విశేష సేవలందించిన ఇద్దరు మహానాయకుల వారసత్వాలు ఒకచోటకు చేరాయి. వ్యవసాయ రంగానికి, ఆహార భద్రతకు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ అందించిన చారిత్రాత్మక శాస్త్రీయ సేవలను, రైతులు, పేదల సంక్షేమం పట్ల డాక్టర్ వైఎస్. రాజశేఖర రెడ్డి అంకితభావాన్ని ఈ అవార్డు ప్రతిబింబిస్తుంది.

ట్రస్టీలు: డాక్టర్ కేవీపీ రామచందర్ రావు (మాజీ రాజ్యసభ సభ్యులు), డాక్టర్ జి. చిన్నారెడ్డి (వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు), డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి (సభ్యులు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ – సీడబ్ల్యూసీ).

# సంపాదకీయం

## బీసీల అగ్రపథం.. చంద్రబాబు సంకల్పం

'జనాభాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే అసలైన లక్ష్యం కావాలి, అప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది' అని చెప్పిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో నడుస్తున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. బలహీన వర్గాలకు కేవలం ఆర్థిక సాయం మాత్రమే సరిపోదని, నిర్ణయాలు తీసుకునే చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం ఉన్నప్పుడే వారి హక్కులు, రక్షణ చట్టాలు సరిగ్గా అమలవుతాయనేది ఆయన భావన. అందుకే చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యమిస్తూ వస్తున్నారు. తాజాగా స్థానిక సంస్థల్లో బీసీలకు దూరమైన 34శాతం రిజర్వేషన్ల కల్పనకు నడుం బిగించారు. జగన్ ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలకు స్థానిక సంస్థల్లో దూరమైన 16,800 పదవులు బీసీలకు అందజేసేలా చంద్రబాబు చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించిన 1983 నుంచి నేటి వరకూ టీడీపీ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేస్తూ వస్తున్నది. బీసీలకు రిజర్వేషన్ల ప్రక్రియలో కీలకమైన రాజకీయ విప్లవానికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలకు 20 శాతం ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లను అమలు చేశారు. ఎన్టీఆర్ అందజేసిన ప్రోత్సాహంతో దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, తెలంగాణకు చెందిన దేవేందర్‌గౌడ్ సహా ఎందరో బీసీ నేతలు పాలనలో నూతన ఒరవడులు సృష్టించారు. వారే కాకుండా, స్థానిక సంస్థల్లోనూ బీసీ నాయకత్వం భళా అనిపించుకుంది. ఎన్టీఆర్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వ పగ్గాలు అందుకున్న చంద్రబాబునాయుడు మొదటి నుంచి బీసీలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తూ వస్తున్నారు. 1987లోనే ఎన్టీఆర్ బీసీలకు 27శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే, చంద్రబాబు ఆ సంఖ్యను 34 శాతానికి పెంచారు. ఆనాడు బీసీల రాజకీయ ప్రాధాన్యానికి తీసుకున్న నిర్ణయం మరెందరో బీసీ నేతలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యమయ్యే అవకాశం కలిగించింది. తరవాత వచ్చిన ప్రభుత్వాలు కూడా బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వచ్చాయి. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్... నా బీసీలంటూనే విశ్వాస ఘాతుకానికి పాల్పడ్డారు. బీసీలు ఎప్పుడూ టీడీపీ పక్షమేనని వారిపై జగన్ కక్షగట్టారు. రాజకీయంగానే కాకుండా ఆర్థికంగా మేలు చేసే 'ఆదరణ' వంటి పథకాలను కూడా రద్దు చేశారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారు. ముఖ్యంగా బీసీలకు రాజకీయ అండదండలు అందజేసే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు 10శాతం మేర కోత పెట్టారు. ఎన్నికల సమయంలో నారా లోకేశ్ తన పాదయాత్రలో బీసీల సమస్యల పరిష్కారానికి భరోసా ఇస్తూ వచ్చారు. జగన్ అసమర్థ, కక్షపూరిత పాలనతో విసిగివేసారిన బీసీలు... చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారు. చరిత్రలో కనీవినీ ఎరుగని విజయమిచ్చారు. అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు... బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా నిర్ణయాలు తీసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా బడ్జెట్‌లో ఇవ్వనన్ని నిధులు కేటాయించారు. ఒకవైపు ఆర్థిక భరోసానిచ్చే పథకాలు అమలుచేస్తూనే... మరోవైపు సామాజిక రక్షణ కోసం బీసీ రక్షణ చట్టం అమలుకు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో చరిత్రలో బీసీలు ఎరుగని పథకాలు, నిధులు సీఎం చంద్రబాబు నాయుడు అందజేశారు. బీసీలకు మొదటి బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు. రెండో బడ్జెట్‌లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు కేటాయించారు. చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వ తదుపరి చర్యకు పంపించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. నిధుల కేటాయింపే కాదు... సంక్షేమ పథకాలను అదే స్థాయిలో అమలు చేస్తున్నారు. అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. గీత కార్మికులకు మద్యం షాపులు, బార్ల వంటి వాటిల్లోనూ 10 శాతం మేర కేటాయించారు. మద్యం షాపుల లైసెన్స్‌లో 50 శాతం రాయితీ ఇచ్చారు. వడ్డెరలకు క్వారీల కేటాయింపుల్లో 33శాతం మేర రిజర్వేషన్లు, 50శాతం మేర సినరేజీ మినహాయింపు ఇచ్చారు. చేపల వేట నిషేధకాలంలో మత్స్యకారులకు ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి 20 వేలకు పెంచారు. నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు గౌరవ వేతనం రూ.20 వేల నుంచి 25 వేలకు పెంచారు. నేతన్నలకు 200లు, 500 యూనిట్ల ఉచిత విద్యుత్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, నేతన్నల సేవలో పథకం కింద రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. దీపం-2 కింద 13.46 లక్షలకు పైగా బీసీ లబ్ధిదారులకు రూ.5,085.93 కోట్లు చెల్లించారు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేల చొప్పున 10.46 లక్షల మంది బీసీ విద్యార్థులకు రూ.1,360.61 కోట్లు అందజేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే బీసీలకు కూటమి ప్రభుత్వం అదనంగా రూ.20 వేల రాయితీ అందజేస్తున్నది. ఆదరణ 1, ఆదరణ 2 పథకాల కంటే మరింత మెరుగ్గా బీసీ లబ్ధిదారులకు సాంకేతిక పరికరాలు అందజేయాలన్న ఉద్దేశంతో రూ.1,000 కోట్లతో ఆదరణ 3.0ను చంద్రబాబు అమలు చేయబోతున్నారు. రాజకీయ, ఆర్థిక గుర్తింపుతో పాటు బీసీలకు నాణ్యమైన విద్య అందజేయాలన్న ఉద్దేశంతో బీసీ గురుకులాలు, హాస్టళ్లను అభివృద్ధి చేస్తున్నారు.

# మంత్రి సుభాష్ చొరవతో కంపు కబేళాకు విముక్తి





తన ప్రజల సుఖంలోనే రాజు సుఖం ఉంది. తన ప్రజల సంక్షేమంలో రాజు సంక్షేమం ఉంది.రాజు తనకు నచ్చినది తన శ్రేయస్సుగా భావించకూడదు. కానీ తన ప్రజలను సంతోషపెట్టేది, తన ప్రజలకు శ్రేయస్సు కలిగించేది మాత్రం తన శ్రేయస్సుకు సంతోషానికి కారణమని భావించాలి. ఇచ్చిన హామీలను సకాలంలో పారదర్శకంగా అమలు చేసేవాడే ప్రజల నమ్మకాన్ని చూరగొని నాయకుడిగా నిలుస్తారు. ఆ కోవకు చెందుతారు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కేవలం ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం కాదు ఇచ్చిన హామీనిసాధించి చూపడం సుభాష్ ప్రత్యేకతగా చెప్పాలి. మాట తప్పని తనమే ఒక నాయకుడికి నిజమైన గౌరవం లభిస్తుందనడానికి మంత్రి సుభాష్ ఆదర్శంగా నిలుస్తున్నారు. గత నలభై ఏళ్ళుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు ముగింపు పలికి అందరి మన్ననలను పొందారాయన. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్ల రామచంద్రపురం రూరల్ మండలం చోడవరం గ్రామంలోని కబేళాతో ప్రజలు దశాబ్దాలుగా అనేక అవస్థలు పడుతున్నారు. ఎందరో నాయకులు వచ్చారు సమస్యను విన్నారే గాని సమస్య పరిష్కారంలో శ్రద్ధ చూపించలేకపోయారు. అయితే గత శాసనసభ ఎన్నికల సమయంలో ఓటర్లు కబేళా కంపు సమస్యను మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తెచ్చారు. కంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని నాడు సుభాష్ హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో అయితే అందరు నాయకుల మాదిరిగానే సుభాష్ కూడ తమ సమస్యను పట్టించుకోరేమోనని ప్రజలు భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే కబేళా సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా మంత్రి అడుగులు వేసి కంపు నుంచి ప్రజలకు విముక్తి కలిగించి అందరిచేత శెభాష్ అనిపించుకున్నారు.




నాలుగు దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న కబేళాను మంత్రి సుభాష్ చొరవతో అధికారులు మూసివేశారు. కబేళా నుండి వెలువడే దుర్వాసన వల్ల దాక్షారామం లోని భీమేశ్వ రుడిని దర్శించే భక్తులు కూడ తీవ్ర ఇబ్బందులు పడేవారు.కబేళా ప్రాంతాన్ని శుభ్రం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇక్కడ పశువధ జరగకుండా సి.సి కెమెరాలను కూడ మంత్రి సుభాష్ ఏర్పాటు చేయించారు. కబేలాల వద్ద పేరుకుపోయిన పశు వ్యర్థాలను, చెత్తను జేసిబీలతో తొలగించిన మున్సిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది. కబేలాల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పశు వధ నిర్మూలించి, తద్వారా కంపు ను పూర్తిగా నిర్మూలించేందుకు అధికార యంత్రాంగం నడుం బిగించడంలో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. మంత్రి సుభాష్ తీసుకున్న చొరవతో కబేళా నిర్వహకుడు యోషయా. కబేళాను మూసివేస్తామని అంగీకరించడంతో 40 ఏళ్ల నాటి కబేల సమస్యకు మోక్షం కలుగనుంది. అంతేకాకుండా కబేళా పై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు డైరీ ఫామ్ ఏర్పాటుకు మంత్రి హామీ ఇచ్చారు. దశాబ్దాలుగా ఎవరూ చేయలేని పనిని మంత్రి వాసంశెట్టి సుభాష్ సాధ్యం చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్ధాల సమస్యకు తెరపడడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరిగింది.

# దళిత సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే శరణ్యం

**- కలెక్టరేట్ ఎదుట సామాజిక శంఖారావం - పాలకులు నిర్లక్ష్యమే**

**సమస్యలు పరిష్కారం కాకపోవడానికి కారణం : మాజీ ఎమ్మెల్సీ ఐ.వి.**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ ఎదుట కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఎ.పి. వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, వివిధ దళిత, ప్రజా సంఘాల ఉమ్మడి ఆధ్వర్యంలో "సామా జిక శంఖారావం చలో కలెక్టరేట్" ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన అధ్యయన యాత్రల్లో వెలుగు చూసిన దళితుల సామాజిక, ఆర్థిక, మౌలిక వసతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సోమవారం ఈ నిరసన చేపట్టారు.దళిత గ్రామాలు నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని అనేక చోట్ల శ్మశాన వాటికలు ఆక్రమణకు గురి కావడం, అక్రమ ఆక్వా సాగు వల్ల తాగునీరు కలుషితం కావడం పట్ల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ ఐ.వెం కటేశ్వరరావు మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారం కోసం కుల మతాలకు అతీతంగా అభ్యుదయ వాదులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. పాలకులు నిర్లక్ష్యమే సమస్యలు పరిష్కారం కాకపోవడానికి కారణం అన్నారు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్క దారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. దళిత సమ స్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే శరణ్యం అని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపులు, జీవో 1235 అమలులో ప్రభుత్వం చూపుతున్న అలసత్వాన్ని ఎండగట్టారు. జిల్లాలో భూస్వాముల చేతుల్లో ఉన్న సుమారు పది లక్షల కొబ్బరి చెట్లను ప్రతి దళిత కుటుంబానికి 15 చెట్లు చొప్పున పంచాలని డిమాండ్ చేశారు. అక్రమంగా దళిత కాలనీలకు ఆనుకుని సాగు చేస్తున్న ఆక్వా చెరువులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ జంగా బాబురావు మాట్లాడుతూ దళిత పేటల్లో మౌలిక సదుపాయాల కల్పన, శ్మశాన స్థలాల పునరుద్ధరణ తక్షణమే జరగాలన్నారు. ప్రముఖ దళిత నాయకులు గడ్డం సురేష్ బాబు మాట్లాడుతూ కుల వివక్షత, అంటరానితనం రూపాలు మార్చుకుని కొనసాగడంపై నిరసన వ్యక్తం చేశారు. అడ్వకేట్ వడ్డీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్, ఎన్ బలరాం, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఐ మంగాదేవి, నాయకులు పి. శివ ప్రముఖ మాలమహానాడు జిల్లా నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, విసికె పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, బొంతు రమణ, పాము బాలయ్య ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దైవ కృప, సిఐటియు ఆశ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుభాషిని, సిహెచ్ దుర్గ, ఏపీఆర్పిఏ రాష్ట్ర అసోసి యేషన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు, డి.నాగేంద్రరాజు, పి కొండలరావు, అబూజీ, ఎన్ అబ్బులు జి.మురళి, మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఏ రవి దళిత సంఘాల, ప్రజాసంఘాల నాయకులు ధోనిపాటి విజయలక్ష్మి, షకీలా, మచ్చనగబాబు, ముంగడ ఆశీర్వాదం, సాపే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 6 లక్షల సిసి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

**- సంక్షేమ పథకాలపై అవగాహన**



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణ పరిధిలో రూ. 6 లక్షల నిధులతో నిర్మించిన సిసి రోడ్డును పెద్దాపురం నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. స్థానిక 28వార్డులో సోమవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు చినరాజప్ప పాల్గొని సిసి రోడ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అనంతరం వార్డులో మహిళల నుంచి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి, సంక్షేమం సాధ్యపడుతుందని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. ఈ సందర్బంగా 29వ వార్డులో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, సరోజ వాసు, మంచెం సాయిబాబు, బలుసు వాసు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబానికి దొరబాబు రూ. 50 వేలు సహాయం...!

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని వైఎస్సార్సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం నియోజకవర్గ జర్నలిస్టు సుబ్రహ్మణ్యం మృతి సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో శ్రీ భీమేశ్వర వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఇంచార్జి దొరబాబు ముఖ్య అతిధిగా పాల్గొని మృతిచెందిన జర్నలిస్ట్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి రూ. 50 వేలు సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతూ వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వానికి, ప్రజలకు విలేకర్లు వారధులుగా పని చేస్తున్నారని తెలిపారు. అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు ఇళ్ల స్థలాలను అందజేయాలన్నారు. సుబ్రహ్మణ్యం ఎంతో నైతిక విలువలతో పని చేశాడని తెలిపారు. అటువంటి వ్యక్తి చిన్న వయస్సులోని మృతి చెందడంతో, చిన్న వయస్సు కలిగిన పిల్లలను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. ఈ మేరకు సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తన వంతు సహాయంగా రూ. 50 వేలు ఆర్థిక సహాయం యూనియన్ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నెక్కంటి సాయి ప్రసాద్, రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణలు సుబ్రహ్మణ్యంకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ విలేకర్లు ఐక్యంగా ఉండి సంక్షేమ నిధిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భారతమాత సేవా పరిషత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమ నిధికి లక్ష రూపాయలు అందించనున్నట్టు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే మేనేజరు ఎం రమేష్, ఎంఈఓ పి.పుల్లయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, సోమేశ్వరరావు మాస్టారు, పెద్దాపురం నియోజకవర్గ జర్నలిస్టులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# సేవాదళం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ





**అల్లవరం, (రాజధాని వార్తలు):** సముద్రంలో వేటకు వెళ్లి 22 రోజులు కావస్తున్న నేటికీ ఆచూకీ లభ్యం కానీ ఆ మత్స్యకార కుటుంబాలకు అల్లవరం మండలం ఓడలరేవుకు చెందిన సేవాదళం సభ్యులు అండగా నిలిచారు. ఓడలరేవుకు చెందిన పాలెపు శాంతారావు, కొల్లాటి శ్రీనుబాబు, ఆరగట్లపాలెంకు చెందిన కొల్లాటి ఏసుదాస్ కుటుంబాలను సేవాదళం సభ్యులు పరామర్శించి ధైర్యం చెప్పి నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెమ్మాడి సత్తిపండు, బొంతు షణ్ము ఖనాథ్, పరమట శ్రీనివాస్, తాడి మధు, మద్దుల గుప్త, రేకాడి శ్రీనివాస్, మోటమర్రి ప్రసాద్, చిలకలపూడి నాగేశ్వరరావు, తాడి శివ, మల్లాడి బాలాజీ తదితరులున్నారు.

# వెయ్యి కోట్ల నుంచి మహేష్ దిగుతాడా?



మహేష్ బాబు ప్రస్తుతం చేస్తున్న 'వారణాసి' ఆయన కెరీర్‌లోనే అతి పెద్ద సినిమా. రాజమౌళి దర్శకత్వం, ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ ప్లాన్, వెయ్యి కోట్లకు పైగా భారీ బడ్జెట్, ఐమాక్స్ స్కేల్.. ఇలా ప్రతి విషయంలోనూ ఈ సినిమా మరో స్థాయిలో ఉంది. 2027 ఏప్రిల్ 7 రిలీజ్‌కు సిద్ధమవుతున్న 'వారణాసి' కోసం దాదాపు 50 భాషల్లో డబ్బింగ్ ప్లాన్ చేస్తున్నారు. అంటే ఇది జస్ట్ పాన్ ఇండియా సినిమా కాదు, మహేష్‌ను గ్లోబల్ మార్కెట్‌లో పెట్టే ప్రాజెక్ట్‌గా రాజమౌళి తీసుకెళ్తున్నారు. ఇలాంటి సినిమా తర్వాత మహేష్ నెక్స్ట్ ఎవరితో చేస్తాడన్నది హాట్ టాపిక్‌గా మారుతోంది. సందీప్ రెడ్డి వంగా, బుచ్చిబాబు పేర్లు గతంలో వినిపించాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో అనిల్ రావిపూడి పేరు గట్టిగా తిరుగుతోంది. 2028 సంక్రాంతికి సినిమా ప్లాన్ చేయొచ్చనే టాక్ కూడా ఉంది. అయితే ఇప్పటివరకు ఇది అధికారికంగా ఫిక్స్ కాలేదు. కానీ మహేష్ అనిల్ కాంబినేషన్ మళ్లీ వస్తే మాత్రం.. సినిమా ఎప్పుడు అన్నది కాదు.. ఏ రేంజ్‌లో చేస్తారు అన్నదే. 'వారణాసి' బడ్జెట్ రూ.1000 కోట్లకు పైగా ఉంటుందని అంచనాలు ఉన్నాయి. మహేష్ కూడా ఈ సినిమా తర్వాత దేశవ్యాప్తంగా కొత్త మార్కెట్‌లోకి వెళ్లే అవకాశం ఉంది. అలాంటి టైమ్‌లో మళ్లీ రూ.100 – 150 కోట్లలో రెగ్యులర్ కమర్షియల్ సినిమా చేయడానికి వస్తాడా? అనిల్ రావిపూడి ఇప్పటివరకు ఎక్కువగా సేఫ్ బడ్జెట్, కామెడీ, మాస్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తోనే పెద్ద హిట్లు ఇచ్చాడు. రాజమౌళి స్థాయి కాన్వాస్‌లో సినిమా చేయాల్సిన అవసరం ఆయనకు ఇప్పటి వరకు రాలేదు. అయితే మహేష్‌కు అనిల్ కొత్త దర్శకుడు కాదు. ఇద్దరూ 'సరిలేరు నీకెవ్వరు' చేశారు. ఆ సినిమా తర్వాత మహేష్ స్వయంగా అనిల్‌తో మళ్లీ సినిమా చేస్తానని చెప్పాడు. అనిల్ ఎనర్జీ, వేగంగా సినిమా పూర్తి చేసే విధానం తనకు బాగా నచ్చిందని అప్పట్లో ఇంటర్వ్యూలో చెప్పాడు. అంటే ఈ కాంబినేషన్‌కు పాత కమిట్‌మెంట్ కూడా ఉంది. ఇక్కడే అనిల్‌కు కూడా పెద్ద ఛాన్స్ ఉంటుంది. మహేష్‌ను 'వారణాసి' తర్వాత మళ్లీ పూర్తిగా లోకల్ కమర్షియల్ హీరోగా చూపిస్తే అది ఒక రకమైన సర్‌ప్రైజ్ అవుతుంది. లేక మహేష్ కొత్త మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని అనిల్ కూడా తన స్కేల్ పెంచుతాడా అన్నది చూడాలి. కామెడీ, మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ వదలకుండా పెద్ద కాన్వాస్‌లో సినిమా చేయగలిగితే అది అనిల్ కెరీర్‌కే మరో జంప్ అవుతుంది. నిజానికి ప్రతి రాజమౌళి సినిమా తర్వాత హీరో తప్పనిసరిగా మరో వెయ్యి కోట్ల సినిమా చేయాల్సిన రూల్ లేదు. కానీ 'వారణాసి' తర్వాత మహేష్ మీద వచ్చే అంచనాలు మాత్రం తక్కువగా ఉండవు. అందుకే అనిల్ రావిపూడితో సినిమా నిజంగా ఫిక్స్ అయితే కథ కంటే ముందే బడ్జెట్, స్కేల్, మార్కెట్ గురించి ప్రశ్నలు మొదలవుతాయి. మరి వారి ప్లాన్ ఎలా ఉంటుందో తెలియాలి అంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

# మళ్లీ పాత పల్లవిలో నయా స్టార్!




టాలీవుడ్ కామెడీ కింగ్‌గా ఓ వెలుగు వెలిగిన అల్లరి నరేష్ తనదైన మేనరిజం, టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ ఎన్నో విజయాలను అందుకున్నారు. వరుస హాస్య చిత్రాలతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన కాలక్రమేణా ప్రేక్షకుల అభిరుచి మారుతున్న తరుణంలో తన జోనర్‌ను మార్చాలని నిర్ణయించుకున్నారు. కేవలం నవ్వులకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక చిత్రాలు చేయాలనే ఉద్దేశంతో సీరియస్ యాక్షన్ థ్రిల్లర్ బాట పట్టారు. ఈ క్రమంలోనే నరేష్ నటించిన నాంది మంచి విజయాన్ని సాధించడంతో నరేష్ ఇకపై సీరియస్ పాత్రలే చేస్తారని అందరూ భావించారు. అయితే ఆ తర్వాత వచ్చిన కొన్ని యాక్షన్ .. థ్రిల్లర్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. ప్రయోగాలు బాగానే ఉన్నా? నరేష్ నుంచి ప్రేక్షకులు కోరుకునే అసలు వినోదం మిస్సవుతోందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో .. అభిమానుల్లో గట్టిగా వినిపించింది. ఈ విషయాన్ని గ్రహించిన అల్లరి నరేష్ పంథాను మార్చుకుని మళ్లీ తనకు కలిసొచ్చిన కామెడీ జోనర్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ప్రేక్షకులకు బోరు కొట్టించిన పాత ధోరణికి భిన్నంగా సరికొత్త ఫన్ .. ఎంటర్‌టైనర్ కథలతో ముందుకొస్తున్నారు. ఇందులో భాగంగానే నరేష్ నటిస్తోన్న తాజా చిత్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం నరేష్ చేతిలో రంభా ఊర్వశి మేనక వంటి ఫాంటసీ టచ్ ఉన్న పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం ఉంది. చంద్రమోహన్ చింతా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనుకోని పరిస్థితుల్లో భూమి మీదకి వచ్చిన దేవకన్యల వల్ల హీరో పడే ఇబ్బపాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అలాగే సభకు నస్కారం, కనక దుర్గ వంటి వినోదాత్మక చిత్రాల్లోనూ నటిస్తున్నారు. నరేష్ ఒక్కసారిగా సీరియస్ రూట్ నుంచి మళ్లీ తన మార్క్ కామెడీ బాటలోకి రావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నరేష్ మళ్ళీ పాత కామెడీ పల్లవిని అందుకుంటే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగని యాక్షన్ థ్రిల్లర్లు నరేష్‌కు సెట్ అవ్వలేదు అని కాదు. యాక్షన్ పాత్రల్లో సైతం తనదైన ముద్ర వేసారు. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే కథలు రొటీన్‌గా ఉండటంతో అవి ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వలేదు. మహర్షిలో రైతు కొడుకు పాత్రతో నరేష్ ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆ పాత్రతో నరేష్ సెకెండ్ ఇన్నింగ్స్ పూర్తిగా మారిపోతుందనుకున్నారు. కానీ ఆ తర్వాత ఎంచుకున్న కథలు కనెక్ట్ కాకపోవడంతో రేసులో వెనుకబడ్డారు.

# గ్లామర్ డోస్ ఓవర్‌లోడ్.. రెడ్ డ్రెస్‌లో రుక్మిణి వసంత్ కిల్లింగ్ స్టిల్స్!



కన్నడ క్యూట్ బ్యూటీ రుక్మిణి వసంత్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. చెన్నైలో జరిగిన ఒక ఈవెంట్‌లో పాల్గొన్న ఈ భామ, అక్కడ అభిమానుల నుంచి లభించిన అపారమైన ప్రేమకు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ క్షణాలను గుర్తు చేసుకుంటూ 'డ్యాష్ అండ్ డాట్' బ్రాండ్‌కు చెందిన రెడ్ డ్రెస్‌లో దిగిన కిల్లర్ పిక్స్‌ను ఇన్స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో నెటిజన్లు ఆమె అందానికి ఫిదా అవుతున్నారు..

**చెన్నై ఈవెంట్‌లో ఎమోషనల్.. రెడ్ డ్రెస్‌లో రచ్చ:**

"చెన్నై.. నిన్నటి తీపి జ్ఞాపకాల నుంచి నేను ఇంకా బయటకు రాలేకపోతున్నాను. నిన్న స్టేజ్ పైకి వెళ్లినప్పుడు మీరు చూపించిన ప్రేమ నన్ను ఎంతగానో మురిపించింది. నిజంగా చాలా కృతజ్ఞురాలిని" అంటూ రుక్మిణి ఒక ఎమోషనల్ నోట్ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె ధరించిన 'క్రిమ్సన్ రెడ్ టై-అప్' హై-లో మ్యాక్సీ డ్రెస్, దాని బ్యాక్ కటౌట్ డిజైన్ ఆమె గ్లామర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి.

**'సప్త సాగరదాచే ఎల్లో' నుంచి క్రేజీ ప్రాజెక్టుల వరకు:**

ఇక 2019లో 'బీర్బల్' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన రుక్మిణి వసంత్, 'సప్త సాగరదాచే ఎల్లో' పార్ట్-ఎ, పార్ట్-బి సినిమాలతో భారీ పాపులారిటీ సాధించారు. ఈ చిత్రానికి గానూ ఫిలింఫేర్ క్రిటిక్స్ బెస్ట్ నటి అవార్డును కూడా గెలుచుకున్నారు. ఆ తర్వాత 'బాణదారియల్లి', 'బఘీర', 'భైరతి రణగల్' వంటి చిత్రాలతో అలరించారు. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'తో తెలుగులోకి, 'ఏస్', 'మాధరాసి' చిత్రాలతో తమిళంలోకి, అల్టిమేట్ హిట్ 'కాంతార: చాప్టర్ 1'తో పాన్ ఇండియా స్థాయిలో మెప్పించారు.

**బిజీ షెడ్యూల్.. ఎన్టీఆర్, యష్ సినిమాల్లో:**

ప్రస్తుతం రుక్మిణి వసంత్ టాలీవుడ్, శాండల్‌వుడ్ ఇండస్ట్రీలలో క్రేజీ ఆఫర్లతో దూసుకుపోతున్నారు. రాకింగ్ స్టార్ యష్ సరసన నటిస్తున్న భారీ చిత్రం 'టాక్సిక్' త్వరలోనే విడుదలకు సిద్ధమవుతుండగా, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో కూడా ఈమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా 'ఎన్‌పి51' చిత్రంతో మలయాళంలోకి కూడా అడుగుపెడుతున్నారు. కుర్రాళ్ల కలల రాణి: తన సహజమైన అభినయంతో, క్యూట్ లుక్స్‌తో సౌత్ ఇండియాలో వరుస అవకాశాలు అందుకని స్టార్ హీరోయిన్‌గా మారుతున్నారు రుక్మిణి వసంత్. తాజాగా ఆమె పంచుకున్న ఈ రెడ్ డ్రెస్ కిల్లింగ్ స్టిల్స్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటూ, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచాయి.

# కృతి సనన్ డ్రెస్సింగ్ వివాదంపై కంగనా రియాక్షన్.. ఆప్షన్స్ ఉన్నప్పుడు ప్రయారిటీ ఎందుకు?





బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, ఎంపీ కంగనా రనౌత్ మరోసారి తన ఘాటు వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ఈసారి ఆమె బాలీవుడ్ భామ కృతి సనన్ ధరించిన దుస్తులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రక్షాబంధన్ సందర్భంగా కృతి నటించిన ఓ జ్యువెలరీ బ్రాండ్ యాడ్‌లో ఆమె వేసుకున్న డ్రెస్సింగ్ శైలిపై నెటిజన్లతో పాటు కంగనా కూడా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పండుగ వాతావరణంలో సంప్రదాయ దుస్తులకు ఆప్షన్లు ఉన్నప్పుడు ఇలాంటి డ్రెస్‌లకు ఎందుకు ప్రాధాన్యత ఇచ్చారంటూ ఆమె ప్రశ్నించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**అసలు వివాదం ఏమిటి?:**

ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్ 'గివా' ఇటీవల రాఖీ పండుగను పురస్కరించుకుని ఓ కమర్షియల్ యాడ్‌ను విడుదల చేసింది. ఈ ప్రకటనలో కృతి సనన్ బ్రా తరహా బ్లౌజ్, డ్రేప్డ్ స్కర్ట్ ధరించి కనిపించారు. పవిత్రమైన రక్షాబంధన్ పండుగకు సంబంధించిన యాడ్‌లో ఇలాంటి బోల్డ్ దుస్తులు ధరించడం ఏంటని సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ సంప్రదాయాలను, సంస్కృతిని హేళన చేసేలా ఈ యాడ్ ఉందంటూ కృతి సనన్‌ను ట్రోల్ చేయడం ప్రారంభించారు.

**రాఖీ కట్టేటప్పుడు బికినీ ఎందుకు?: కంగనా ప్రశ్న:**

ఈ డ్రెస్సింగ్ వివాదంపై కంగనా రనౌత్ తనదైన శైలిలో స్పందించారు. "ఈ రోజుల్లో మహిళలకు దుస్తుల విషయంలో చాలా రకాల ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. ఇక కాక్‌టైల్ డ్రెస్సులు, లెహంగా చోలీలు, జీన్స్, సాంప్రదాయ చీరలు వంటివి ఎన్నో అందుబాటులో ఉన్నప్పుడు, బికినీ లేదా ఇన్నర్‌వేర్ తరహా దుస్తులు ధరించి రాఖీ కట్టడం ఏంటి? ఈ యాడ్‌ను కావాలనే అసభ్యకరంగా తీసినట్లు కనిపిస్తోంది" అని కంగనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

**స్పందించని కృతి సనన్:**

సోషల్ మీడియాలో ఈ యాడ్‌పై పెద్ద ఎత్తున దుమారం రేగుతున్నప్పటికీ, అలాగే కంగనా రనౌత్ ఘాటు విమర్శలు చేసినప్పటికీ కృతి సనన్ గానీ, సదరు జ్యువెలరీ బ్రాండ్ గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. విమర్శలపై కృతి ఎలా స్పందిస్తుందో అని బాలీవుడ్ వర్గాలతో పాటు అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పండుగల వేళ సంస్కృతి ముఖ్యం: సంప్రదాయ పండుగలకు సంబంధించిన ప్రకటనల్లో దుస్తుల ఎంపిక విషయంలో జాగ్రత్త వహించాలని, సంస్కృతికి భంగం కలగకుండా చూసుకోవాలని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మరి కంగనా చేసిన ఈ ఆప్షన్స్ అండ్ ప్రయారిటీ వ్యాఖ్యలపై కృతి సనన్ ఏ రకంగా రియాక్ట్ అవుతుందో వేచి చూడాలి!

# యువత మేలుకో..డ్రగ్స్‌కు బానిస కావద్దు : డి.ఎస్.పి అరుణ్ కుమార్

## - డ్రగ్స్ మహమ్మారిని అరికట్టాలి...విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి : 4వ వార్డ్ మెంబర్ బండారు శరత్ బాబు





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ భద్రాచల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ భద్రాచల పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ అరుణ్ కుమార్ పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి ప్రభావం మరియు వాటికి దూరంగా ఉండాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. అలాగే 4వ వార్డు మెంబర్, ఎస్ఎఫ్ఐ పట్టణ ఇంచార్జ బండారు శరత్ బాబు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు విద్యార్థులు, యువత ఎట్టి పరిస్థితుల్లోనూ బానిస కావద్దని సూచించారు. డ్రగ్స్ మొదట సరదాగా లేదా స్నేహితుల ఒత్తిడితో ప్రారంభమైనప్పటికీ, క్రమంగా తీవ్రమైన వ్యసనంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యంతో పాటు చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు తీవ్రంగా దెబ్బతింటాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్ వ్యాపారాన్ని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. డ్రగ్స్ విక్రయించే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, విద్యార్థులు మరియు ప్రజలు డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉన్నప్పుడు పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు. విద్యార్థులు ఏవైనా సమస్యలను ఎదుర్కొంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. 4వ వార్డు మెంబర్, ఎస్ఎఫ్ఐ పట్టణ ఇంచార్జ్ బండారు శరత్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో చదువు అత్యంత ముఖ్యమైనదని, తమ లక్ష్యాలను సాధించేందుకు కష్టపడి చదవాలని అన్నారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వంటి చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని తమలో ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు.యువత ఏ దేశానికైనా ప్రధానమైన శక్తి అని, అలాంటి యువత డ్రగ్స్‌కు బానిస అయితే సమాజం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. అందువల్ల డ్రగ్స్ వ్యతిరేక పోరాటాన్ని కేవలం పోలీసు శాఖకే పరిమితం చేయకుండా ప్రభుత్వం, విద్యా శాఖ, పోలీసు శాఖ, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు మరియు ప్రజా సంఘాలు కలిసి ముందుకు సాగాలని కోరారు.ఎస్ఎఫ్ఐ భద్రాచల పట్టణ కార్యదర్శి కొప్పుల రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కూడా విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండటమే కాకుండా తమ తోటి విద్యార్థులను కూడా డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యాప్తికి ప్రధాన కారణాలను గుర్తించి వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐగా డిమాండ్ చేస్తూ ముఖ్యంగా విద్యాసంస్థలు, కళాశాలలు, హాస్టళ్లు మరియు యువత ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 27న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని ఇన్‌ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితితో కలసి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా కళారత్న పురస్కార గ్రహీత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ పూర్వ సభ్యులు కత్తిమండ ప్రతాప్ కుమార్, గౌరవ అతిథిగా తెలంగాణాకు చెందిన సామాజిక కార్యకర్త గుంత లక్ష్మణ్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆహ్వాన ప్రతులను, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్‌లతో కలిసి ఇన్ ఛార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి, గ్రంథాలయ అధికారి డాక్టర్ కొల్లె శంకర్ రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త డా.ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, సభ్యులు డాక్టర్ మన్నాల ప్రసాద్, సహాయ గ్రంథాలయాధికారి డాక్టర్ దాసరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ప్రహరీ గోడ కూలింది

## - సెలవు కావడంతో తప్పిన ప్రమాదం



**మక్కువ, (రాజధాని వార్తలు):** మండలంలోని కోన ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలుకు ప్రహరీగోడ నానిపోవడంతో మరుగుదొడ్లు పక్కనున్న పాఠశాల వెనుక భాగం ప్రహరీ గోడ కూలిపోయింది. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు సుమారు 280 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల ప్రహరీ గోడ చాలా వరకు పాడైపోయి, ముక్కలుగా తయారయిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల ప్రహరీ గోడ కూలి ఓ విద్యార్థి సాలూరులో మృతి చెందిన ఘటన విధితమే. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ప్రమాదం తప్పిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల ప్రహరీ గోడ కూలిపోయిన విషయాన్ని సోమవారం గుర్తించామని, ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు హెచ్ఎం బి.సాయిలక్ష్మి తెలిపారు.

# ఘనంగా డాక్టర్ నీలిమ ప్రియదర్శిని జన్మదిన వేడుకలు

## - విద్యార్థులకు నోట్ పుస్తకాలు పెన్నులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



**నాయుడు పేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట పట్టణంలోని నీలిమ ప్రియదర్శిని ఈఎన్టీ హాస్పిటల్, ట్రినిటీ హాస్పిటల్స్ డాక్టర్ నీలిమ ప్రియదర్శిని జన్మదిన వేడుకలు నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ నీలిమ ప్రియదర్శిని, డాక్టర్ ఆదవరం అనుదీప్ దంపతులు పాఠశాల విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. అలాగే వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ ప్రియదర్శిని మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల మధ్య తన జన్మదినం వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలియజేశారు. ఎన్ఎస్ఆర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ ఆదవరం అనుదీప్ మాట్లాడుతూ ఎన్ఎస్ఆర్ కాలనీ వాసుల వినతి మేరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రేకుల షెడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు పాఠశాల భవనానికి రంగులు వేయించిన ఉన్నట్లు తెలియజేశారు. ఈ పనులన్నీ వారం పది రోజుల్లో మొదలు పెట్టనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తురక మహేంద్ర, లోకసారి శ్రీకాంత్, పారిచర్ల సాయి తేజ, మావుదూరు అనిల్, తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026 పోటీలు ప్రారంభం



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి ఎన్టీఆర్ స్టేడియం వేదికగా అమరావతి ఛాంపియన్‌షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆగస్టు 27 వరకు జరిగే ఈ పోటీల్లో 12 క్రీడాంశాల్లో అండర్-17, అండర్-23 విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడుతున్నారు. 175 నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రాథమిక పోటీల్లో 2.07 లక్షల మందికి పైగా క్రీడాకారులు పాల్గొనగా, రాష్ట్రస్థాయికి 9,911 మంది ఎంపికయ్యారు. ఈ భారీ క్రీడా కార్యక్రమం ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విజేతలకు రూ.92 లక్షల ప్రైజ్‌మనీ అందించనున్నట్లు తెలిపారు. క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2 నుంచి 3 శాతానికి పెంచి నట్లు వెల్లడించారు. హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయని అన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, సాఫ్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్న ఆలయ మాజీ చైర్మన్ అంజూరు





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తొట్టంబేడు మండలం రామచంద్రపురం గ్రామంలో శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారి ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన భగవాన్ వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కీ.శే. పీజె చంద్రయ్య శెట్టి కుమారుడు పీజీ తులసి కృష్ణ ఆయనకు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. పూజా కార్యక్రమాల అనంతరం శ్రీనివాసులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వయంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన కాలంగి గ్రామానికి చెందిన బత్తిరెడ్డిని అభినందించినారు.

అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది. ఈ విధమైన అన్నదాన కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించినందుకు మీకు, మీ కుటుంబ సభ్యులకు కూడా ఆ వెంకయ్య స్వామి వారి ఆశీస్సులు ఉంటాయని తెలియజేశారు. గతంలో పి.జె చంద్రయ్య అనేక వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు జరిపారన్నారు.. ఆయన యొక్క ఆఖరి కోరిక నవగ్రహాలు దంపతుల సమేతంగా అంటే తొమ్మిది గ్రహాలు సతీసమేతంగా విగ్రహాలు ఏర్పాటు చేయాలని వాటన్నింటినీ కూడా తొందరలోనే గ్రామ పెద్దలతో చర్చించి, కుంభాభిషేకానికి కూడా నిర్వహించే ఏర్పాటు చేస్తున్నా మని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, శ్రీవారి సురేష్, మొగరాల గణేష్, దాము, గిరి గౌడ్, గ్రామ ప్రజలు మరియు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పి జి ఆర్ ఎస్‌కు వచ్చిన అర్జీదారుల సమస్యలపై సకాలంలో పరిష్కారం చూపాలి

## - జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు



**తిరుపతి, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలె క్టరేట్‌నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగు నీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు నీటి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్‌లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజిఆర్ ఎస్‌లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి జి.నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు, భరత్ నాయక్, నాగార్జున, రామాంజనమ్మలతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కేంద్రంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో తన భూ సమస్యను పరిష్కరించిన జిల్లా కలెక్టర్‌కు జేసి ఆర్.గోవిందరావుని కలసి రెవెన్యూ సిబ్బందికి రైతు అంజూరు రామమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. శాఖల వారీగా అర్జీల వివరాలు : రెవెన్యూ-180, సెర్ప్-7, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-4, హోమ్-17, పంచాయత్ రాజ్-39, ఉద్యాన శాఖ-1, రిజిస్ట్రేషన్ & స్టాంప్స్-3, ఎస్ ఎస్ ఎల్ ఆర్-8, గనులు శాఖ-2, రూరల్ డెవలప్మెంట్- 3, గ్రామ/వార్డు సచివాలయం-4, విద్యుత్ శాఖ-4, హౌసింగ్ -2, పౌర సరఫరాల శాఖ-2, బి సి వెల్ఫేర్-1, కార్మిక శాఖ-1, విద్యా శాఖ-1, ఫ్యామిలీ వెల్ఫేర్-3, ఇండస్ట్రీస్-1, ఆర్ డబ్ల్యూఎస్-1, దేవాదాయ శాఖ-1, ఎస్సి కార్పొరేషన్-2, మెప్మా-1, ఇరిగేషన్-5, అగ్రికల్చర్-1, ఇంటర్మీడియేట -3, మత్స్య శాఖ-3, తెలుగు గంగ-1, ఆర్ అండ్ బి-1 వెరసి మొత్తం 305 అర్జీలు రావడం జరిగిందని సంబంధిత అధికారులు వచ్చిన అర్జీలపై దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరైన వివిధ శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజ్, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్లాటెనిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం చేయాలి

## - మాయమ్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక అధికారులతో సమన్వయం చేయండి - అన్ని వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోండి - రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లి జాడ తెలియకుండా పోయిన వారి ఆచూకీ కనుగొనేందుకు కొనసాగుతున్న గాలింపు, సహా యక చర్యలను మరింత ముమ్మరం చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. సముద్రంలో జాడ తెలియకుండా పోయిన ఏడుగురు మత్స్యకారులు ఈనెల 3న ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నుంచి ఎంఒ 135 అనే చేపల బోటులో సముద్రంలోకి వెళ్లారని, వారు ఆగస్టు 15 లేదా 16 తేదీల్లో తిరిగి రావాల్సి ఉండగా అప్పటి నుంచి వారి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. మత్స్యకారుల ఆచూకీ కోసం రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం,భారత కోస్ట్ గార్డ్, భారత నావికాదళం, మెరైన్ పోలీస్, మత్స్యశాఖతో పాటు ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో గాలింపు చర్యలు చేపడు తున్నాయని ఆగస్టు 17 నుంచి కోస్ట్ గార్డ్, నావికాదళ నౌకలను ప్రతిరోజూ గాలింపు చర్యలకు మోహరించడంతో పాటు రెండు డోర్నియర్ విమానాలను కూడా వినియోగిస్తున్నా మని కేంద్ర మంత్రికి ఎంపీ వివరించారు. కాకినాడ, విశాఖపట్నం, తమిళ నాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల నుంచి కోస్ట్ గార్డ్ దళాలు బంగాళాఖాతంలో విస్తృతంగా గాలింపు నిర్వహిస్తున్నారని గాలింపు పరిధిని ప్రత్యేక ఆర్థిక మండలి (ఈ ఈ జెడ్) వరకు విస్తరించడంతో పాటు సముద్రంలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలు కూడా గల్లంతైన బోటును గమనించి ఏదైనా సమాచారం లభించిన వెంటనే అధికారులకు తెలియజేయాలని నవ్టెక్స్ సందేశం ద్వారా కోరారన్నారు. అయితే, గల్లంతైన బోటులో ఏఐఎస్, డి ఏ టి లేదా శాటిలైట్ ఫోన్ వంటి కమ్యూనికేషన్/ట్రాకింగ్ పరికరాలు లేకపోవడం వల్ల దాని కచ్చితమైన స్థానాన్ని గుర్తించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని ఇన్కాయిస్‌కు చెందిన సరాట్ వ్యవస్థ ద్వారా గుర్తిస్తున్న అత్యంత ఖచ్చిత మైన గాలింపు ప్రాంతాన్ని ప్రతిరోజూ పరిశీలిస్తూ సముద్రంలో ఉన్న గాలింపు బృందాలకు అందిస్తున్నారన్నారు. ప్రస్తుత సముద్ర ప్రవాహాల ఆధారంగా బోటు తూర్పు లేదా ఈశాన్య దిశగా కొట్టుకుపోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తు న్నారు. బోటు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లి ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఎం ఆర్ సి సి ఢాకా, మయన్మార్ అధికారులకు కూడా సమాచారం అందించినట్లు తెలిపారు. మత్స్యకారులు సుమారు 17 రోజులకు సరిపడా ఆహార సామాగ్రిని వెంట తీసుకెళ్లినప్పటికీ ఆ వ్యవధి ఇప్పటికే అయిపోయిందని వివరించారు. దీంతో గడుస్తున్న రోజులు కీలకంగా మారాయని గాలింపు చర్యలను మరింత విస్తృత స్థాయిలో కొనసాగించాల్సిన అవసరం ఉందని ఎంపీ హరీష్ బాలగిరి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. గాలింపు చర్యల కోసం అదనపు నౌకలు, వైమానిక వనరులు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక నిఘా సామర్థ్యాలను వినియోగించాలని కోరారు. బంగాళాఖాతం అం తటా గాలింపు పరిధిని మరింత విస్తరించి తూర్పు తీరంలో ప్రయాణించే మత్స్యకార, వాణిజ్య మరియు ఇతర నౌకలను నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని మంత్రిని కోరారు. గల్లంతైన బోటు అందులోని మత్స్యకారుల ఆచూకీకి సంబంధించిన చిన్న సమాచారం లభించినా వెంటనే సంబంధిత అధికారులకు చేరేలా సమన్వయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, మయన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాల సంబంధిత సముద్ర భద్రతా, గస్తీ రక్షణ సంస్థలతో అవసరమైన అంత ర్జాతీయ సమన్వయాన్ని మరింత పెంచాలని కోరారు. ఏడుగురు మత్స్యకారుల కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయని వారి సురక్షిత ఆచూకీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్ని వ్యవస్థలు సమన్వ యంతో పనిచేసి, గాలింపు చర్యలను సాధ్యమైనంత విస్తృత స్థాయిలో కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మత్స్యకారులను సురక్షితంగా గుర్తించే వరకు అన్ని అవకాశాలను వినియోగిస్తూ చర్యలు కొనసాగించాలని రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్‌ను ఎంపీ హరీష్ కోరారు.

# సూళ్లూరుపేట అభివృద్ధి పనులపై డిఆర్‌సిలో చర్చించిన ఎమ్మెల్యే డా.విజయశ్రీ



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ (డి ఆర్ సి) సమావేశంలో సూళ్లూరుపేట నియోజకవర్గానిక సంబంధించిన పలు ముఖ్యమైన, అత్యవసర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సూళ్లూరుపేట పట్టణ ప్రజల రాకపోకలకు అత్యంత కీలకమైన కళంగి బ్రిడ్జి పనులకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేసి, అతి త్వరలో పనులు అమలులోకి తీసుకురావాలని కోరారు. దీర్ఘకాలంగా అవసరంగా ఉన్న పూడి దొరువు పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. నియోజకవర్గంలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సిజెఎఫ్ఎస్ భూములకు పట్టాలు మంజూరు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సూళ్లూరుపేట నియో జకవర్గ పరిధిలోని జాతీయ, రాష్ట్ర రహదారుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగే డేంజర్ స్పాట్స్‌ను గుర్తించి,అవసరమైన ప్రాంతాల్లో వెంటనే స్ట్రీట్ లైట్లు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజల భద్రత, మౌలిక వసతులు, అభివృద్ధికి సంబంధించిన అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇచ్చి త్వరగా పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ కోరారు.

# పిజిఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

## - జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జాయింట్ కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు డిఆర్‌వో విజయకుమార్, వివిధ శాఖల అధికారులు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ ఉమ్మడి నెల్లూరు జిల్లా మహాసభ మహా డిమాండ్లు

**- జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏ ఉమ్మడి నెల్లూరు జిల్లా సదస్సులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి - ఘనంగా ఏపిడబ్ల్యూజెఎఫ్, ఏపిబిజేఏ ఉమ్మడి నెల్లూరు జిల్లా మహాసభ - అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, 50% ఫీజు రాయితీ అమలుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధుల హామీ - చిన్న, మధ్యతరహా పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్, 30% ప్రకటనల వాటా కేటాయించాలని ఏపిఎంఎస్‌డిపిజేఏ డిమాండ్ - 30% యాడ్స్ వాటా కేటాయించాలని ఏపీఎంఎస్‌డీపీజేఏ' సంఘం డిమాండ్ - నెల్లూరులో ఘనంగా 'ఏపీఎంఎస్‌డీపీజేఏ' లోగో ఆవిష్కరణ**

















**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా మహాసభ నిర్వహించారు. సుమారు 200 మంది జర్నలిస్టులు పాల్గొన్న ఈ సభలో ప్రజాస్వామ్య పరిరక్షణలో ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియా పాత్ర అత్యంత కీలకమని, సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని సర్వేపల్లి శాసనసభ్యులు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ఆంధ్రప్రదేశ్ మీడియం, స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్' అధికారిక లోగోను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తదితర ప్రముఖులు ఆవిష్కరించారు.

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి: సోమిరెడ్డి**

ప్రభుత్వాలు, అధికారులు తీసుకునే నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే వారధులు జర్నలిస్టులేనని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కొనియాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో మండలాల వారీగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు దక్కేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యేలా చూస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా సీనియర్ పాత్రికేయులకు పెన్షన్ పథకం అమలు, అణగారిన వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించేలా మీడియా కార్యాచరణ ఉండాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మీడియం, స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి హుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పత్రికల ప్రధాన డిమాండ్ల ను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళాలని ప్రజా ప్రతినిధులను,అధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 300కి పైగా పత్రికలు, 5,000 మంది పాత్రికేయుల జీవనోపాధి ఆధార పడి ఉన్న చిన్న, మధ్యతరహా పత్రికల పరిరక్షణకు సంఘం పలు కీలక తీర్మానాలను ప్రభుత్వం ముందుంచింది. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు: చిన్న, మధ్యతరహా పత్రికల మౌలిక సదుపాయాలు, రుణ సహాయం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ప్రకటనల్లో 30% వాటా: సీఎం హామీ మేరకు ప్రభుత్వ ప్రకటనలలో 30 శాతం వాటాను చిన్న, మధ్యతరహా దినపత్రికలు, పీరియాడికల్స్‌కు తప్పనిసరిగా కేటాయించాలి. సులభతర విధానం: ప్రచురణల క్రమబద్ధత కోసం పీఐబీ తరహా ఆన్‌లైన్ అప్‌లోడ్ విధానాన్ని ప్రవేశపెట్టాలి.

పత్రికల ఎంపానల్‌మెంట్ ప్రక్రియను ఏడాదికి రెండుసార్లు (ప్రతి ఆరు నెలలకు ఒకసారి) తప్పనిసరిగా నిర్వహించాలని కోరుతున్నాము. అలాగే, ఈ ప్రక్రియలో పక్ష పత్రికలను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాము. కార్యక్రమాలు మరియు ప్రముఖ ఎంపీల పర్యటనలకు సంబంధించిన వార్తల కవరేజీలో మధ్య తరహా మరియు చిన్న పత్రికలకు తగిన ప్రాతినిధ్యం తప్పనిసరిగా కల్పించాలని కోరుతున్నాము. సంక్షేమ పథకాలు: సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, ప్రమాద బీమా సౌకర్యం, సి ఆర్ మీడియా అకాడమీ బోర్డులో ప్రాతినిధ్యం, నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహించాలి.

**వృత్తి విలువలు కాపాడాలి: వక్తల పిలుపు**

సదస్సులో పాల్గొన్న శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూనే, రాజకీయ ప్రయోజనాలకు తావులేకుండా నిష్పాక్షికంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్లు స్థలాలు ఇవ్వాలని, రాష్ట్రమంతా ఫీజు రాయితీని అమలు పరచాలని, కేంద్రం తీసుకొచ్చిన ఆ చట్టాల వల్ల జర్నలిస్టుల పనితీరుకు పెద్ద సమస్యగా మారిందని, విధి నిర్వహణలో గోప్యత చాలా ఇబ్బందికరంగా మారుతోందని ఆ చట్టాలను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని కోరిన APWJF, APBJA ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి సదస్సులో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు. అలాగే కేంద్రం తీసుకొచ్చిన ఆ చట్టాల వల్ల జర్నలిస్టుల పనితీరుకు పెద్ద సమస్యగా మారిందని, జర్నలిస్ట్ వృత్తికే ప్రమాదం వచ్చిందని, తప్పులను ప్రశ్నిస్తే ఈడీ దాడులు, ప్రజా సమస్యల్ని సమాజానికి తెలియజేయాలని, లేకుంటే జర్నలిజం మీద ప్రజల్లో కూడా గౌరవం తగ్గిపోతుందని APWJF, APBJA ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకట్రావ్ తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై తక్షణమే ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ రోజుల్లో వార్తని ఎవరూ దాచి పెట్టలేరు, 150 కోట్ల మంది ప్రజల్లో ఎవరో ఒకరు బయటకు తీసుకు వస్తారు, జీతాలు లేకుండా పని చేసేది జర్నలిస్టులు మాత్రమే ఏపీబీజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ శ్రీనివాసులు. నాలుగొద్దు...ఒకటే పెట్టండి, మీరు లేకపోతే నేను లేను, నా ఉద్యమాలను బాగా గౌరవించింది పాత్రికేయులే. జర్నలిస్టుల సంక్షేమానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తా. APWJF, APBJA ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి సదస్సులో ఎమ్మెల్యే కోటంరెడ్డి. కారణం మనమే...జర్నలిజంలో నైతిక విలువలు దిగజారిపోయాయి. ఐక్యత లేకపోవడమే ఇందుకు కారణం. రాజకీయ నేతలకు తొత్తులుగా వ్యవహరించడం మానుకోవాలి. APWJF, APBJA ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ జయరాజ్.

**జర్నలిస్టులపై వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సంచలన కామెంట్స్**

ఏదో ఒక రాజకీయ నాయకుడుకి కొమ్ము కాయద్దు. రాజకీయ లబ్ధి కోసం జర్నలిజాన్ని ఉపయోగించొద్దు. తప్పు చేస్తే చూపించే ధైర్యం ఉండాలి. ఆ ప్రయత్నాలకు జర్నలిస్టులు సహకరించొద్దు. APWJF, APBJA ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి సదస్సులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. APWJF, APBJA ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి సదస్సులో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ. జర్నలిస్టు వృత్తి ఎంతో పవిత్రమైంది. ప్రజలకి, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయం. జర్నలిస్టుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తాం. APWJF, APBJA ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థాయి సదస్సులో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు. ఈ మహాసభలో నెల్లూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. APWJF జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు: సుధాకర్, బాలకృష్ణ APBJA జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు: శ్రీధర్ రెడ్డి, మునీంద్ర. చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షులు: బి. సుబ్రహ్మణ్యం (బాలు). ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మ, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఏపీ బీజే ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా స్థాయి నాయకులు బాలకృష్ణ, సుధాకర్, ఆంధ్రప్రదేశ్ మీడియం, స్మాల్ డైలీ అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి హుస్సేన్ ఖాన్ పాల్గొన్నారు. జిల్లా నుంచి సీనియర్ పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయంతం చేశారు.

# వేళంగిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు




**వేళంగి, (రాజధాని వార్తలు):** కరప మండలం వేళంగి గ్రామంలో కొత్తపేట, ఎనుగు బంద (వైబీ) కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామ కూటమి నాయకులు చుండ్రు వెంకన్నరావు సమస్యను కాకినాడ శాసనసభ్యులు పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు, కూటమి నాయకులకు సూచించారు.

ఆదేశాల మేరకు సోమవారం అధికారులు, కూటమి నాయకులు కొత్తపేట, వైబీ కాలనీల్లోని ప్రతి వీధిని సందర్శించి ప్రజల తాగునీటి ఇబ్బందులను పరిశీలించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు బండారు మురళి, సీనియర్ నాయకులు భోగి రెడ్డి కొండబాబు, కరప మండల డిప్యూటీ ఎంపీడీఓ సలాది వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శి పినిశెట్టి ఉమామహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వర్ధన్, స్వర్ణ గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** దేవాలయాల పూజాదికాలు, నిత్య జీవితంలో అనుకోకుండా జరిగే పొరపాట్ల ప్రక్షాళనకు ఏడాదికి ఒకసారి దేవాలయాల్లో పవిత్రోత్సవాలు నిర్వహించడం ఎంతో ఉపయుక్తమని పెద్దాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి కే జగదీశ్వరరావు అన్నారు. స్థానిక ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించే పవిత్రోత్సవ పూజలు సోమవారం ఘనంగా ముగిసాయి. ఆలయ అధికారి జగదీశ్వరరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ జల్లూరి వీర్రాజుల ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవాలను నిర్వహించారు. ఈ పూజల్లో తెదేపా రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి మాట్లాడుతూ పూజలో మంత్రాలను ఉచ్చరించే సమయంలో అనుకోని విధంగా ఆటంకం సంభవించిన, మనకు తెలియకుండానే మన కాళ్ళ కింద చిన్నపాటి జీవులు మృతి చెందిన, మనకు తెలియకుండా ఎవరికైనా నష్టం వాటిల్లిన వాటి ప్రక్షాళనకు ఏడాదికి ఒకసారైనా ఈ పవిత్రోత్సవాలు నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ పూజల ద్వారా దోషాలు పరిష్కరించబడి ఆలయ అభివృద్ధి జరుగుతుందని, ఆలయానికి వచ్చే భక్తుల



సంఖ్య పెరుగుతుందని, ఆలయాలకు పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని అన్నారు.

ఈ పవిత్రోత్సవాల్లో ముగింపులో భాగంగా ప్రత్యేక శాస్త్రంగా శాంతి హోమాలను నిర్వహించారు. పూర్ణాహుతి పూజల్లో ముఖ్య అతిథులతో పాటు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు దంపతులుగాను, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక రీతిలో తీసుకు వచ్చిన పవిత్రాలను ఆలయంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ధర్మకర్తల మండల సభ్యులు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan